

# ప్రజాస్ఫూర్తి

PRAJASPOORTHI TELUGU DAILY

తెలుగు దినపత్రిక

PS NEWS

మేడ్చల్ - మల్కాజిగిరి | ఎడిటర్ - గడ్డమీది బాలరాజు | బుధవారం 04-02-2026 | సంపుటి - 26 | సంచిక -256 | రూ : 4 | పేజీలు: 8



2లో

## హైదరాబాద్...
## రైల్వే హబ్ కాబోతుంది

- వికసిత్ భారత్ 2047 కోసం పెట్టిన బడ్జెట్ అన్న కిషన్ రెడ్డి
- ఉచిత పథకాల కోసమే బడ్జెట్ అన్నట్లు తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఆగ్రహం
- ప్రజలు ఆశిస్తున్న సుస్థిర ప్రగతికి దోహదపడేలా బడ్జెట్ ఉందన్న కిషన్ రెడ్డి

## ఈ నెలాఖరులోనే
# రాష్ట్ర బడ్జెట్!

- వారంపాటు సమావేశాలు నిర్వహించాలని నిర్ణయం
- సంక్షేమ పథకాలకు కేటాయింపుపై ఉత్కంఠ
- ఆరు గ్యారెంటీలకు నిధులు దక్కేనా ?
- వ్యవసాయ, విద్య, వైద్య రంగాలకు పెద్ద పీట ?
- నిరుద్యోగ భృతికి మొండిచేయేనా ?
- కేంద్రబడ్జెట్‌లో తెలంగాణకు నిరాశే




2లో

### ఎస్ఎఫ్‌డీఆర్ పరీక్ష
## విజయవంతం..

**భారత రక్షణ రంగంలో కీలక ముందడుగు**

- ఎస్ఎఫ్‌డీఆర్ టెక్నాలజీని విజయవంతంగా పరీక్షించిన డీఆర్‌డీవో
- ఒడిశాలోని చాందీపూర్ తీరంలో జరిగిన ప్రయోగం
- సుదూర గగనతల క్షిపణుల అభివృద్ధికి మార్గం సుగమం
- ఈ టెక్నాలజీతో భారత్‌కు పెరగనున్న వ్యూహాత్మక బలం



2లో



2లో

### సహనమే భారత్ ను
## గెలిపించిందన్న మోదీ

- అమెరికాతో ట్రేడ్ డీల్ పై స్పందించిన ప్రధాని
- ఎన్ని విమర్శలు వచ్చినా సహనంతో ఉన్నామని వెల్లడి
- వాణిజ్య చర్చలపై ప్రభుత్వ స్థిరమైన వైఖరికి ఇదే నిదర్శనమని వ్యాఖ్య

### లోక్‌సభలో
## తీవ్ర ఉద్రిక్తత..

**8 మంది కాంగ్రెస్ ఎంపీల సస్పెన్షన్**



2లో

- బడ్జెట్ సమావేశాలు ముగిసే వరకు వేటు వేసిన ఇన్చార్జి స్పీకర్
- చైర్ వైపు కాగితాలు విసిరి, సభకు అంతరాయం కలిగించారని ఆగ్రహం
- చైనా సరిహద్దు వివాదంపై చర్చకు పట్టుబట్టిన రాహుల్ గాంధీ
- మాజీ ఆర్మీ చీఫ్ నరవణే పుస్తక ప్రస్తావనపై సభలో వాగ్వాదం

# ఎక్కడ వెనుకబడ్డామో గుర్తించండి

- అసంతృప్త నేతలను బుజ్జగించండి
- రోజువారీ రిపోర్టు ఇవ్వండి : 'పురపోరు'పై మంత్రులతో సీఎం రేవంత్‌రెడ్డి
- నేడు మిర్యాలగూడ నుంచి ఎన్నికల ప్రచారం

2లో





2లో

## ఢిల్లీ చేరుకున్న నారా లోకేశ్..
### రేపు కేంద్రమంత్రులతో వరుస సమావేశాలు

- రాష్ట్ర అభివృద్ధి, నిధుల సమీకరణే ప్రధాన అజెండా
- అమరావతి, విభజన హామీలపై చర్చించే అవకాశం
- ఐటీ, విద్యా రంగాల విస్తరణపై ప్రత్యేక దృష్టి

# ఎక్కడ వెనుకబడ్డామో గుర్తించండి

హైదరాబాద్ : 'మన పార్టీ ఏయే మున్సిపాల్టీల్లో వెనుకబడి ఉందనే విషయాన్ని వెంటనే గుర్తించండి, అక్కడ వెంటనే రంగంలోకి దిగండి, బలోపేతానికి యుద్ధ ప్రాతిపదికన చర్యలు తీసుకోండి...' అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మంత్రులు, మున్సిపల్ ఎన్నికల బాధ్యులను ఆదేశించారు. టిక్కెట్ రాలేదని అలకబూనిన అసంతృప్త నేతలను బుజ్జగించాలని ఆయన వారికి సూచించారు. క్షేత్రస్థాయి పరిస్థితులపై ఏరోజుకారోజు రిపోర్టును తనకు అందజేయాలని ఆదేశించారు. మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో కాంగ్రెస్ అనుసరించాల్సిన వ్యూహంపై చర్చించేందుకు సీఎం రేవంత్ రెడ్డి మంగళవారం సాయంత్రం హైదరాబాద్ జూబ్లీహిల్స్‌లోని తన కార్యాలయంలో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ఏఐసీసీ ఇంఛార్జి మీనాక్షి నటరాజన్, టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్, వివిధ పార్లమెంటు నియోజకవర్గాల పరిధిలోని మున్సిపాల్టీలకు బాధ్యులుగా ఉన్న మంత్రులు ఈ భేటీకి హాజరయ్యారు. జిల్లాల్లో నామినేషన్ల ఉపసంహరణ కార్యక్రమాల్లో బిజీగా ఉన్నందున డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, మంత్రి అడ్లూరి లక్ష్మన్ కుమార్ ఈ సమావేశానికి హాజరు కాలేదు. అయితే పీసీసీ చీఫ్‌కు వారు ఇదే విషయమై సమాచారమిచ్చారు. సమావేశంలో సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ... పలు సర్వేల ప్రకారం పార్టీ వెనుకబడి ఉన్న మున్సిపాల్టీల్లోని పరిస్థితులపై విశ్లేషించారు. తనతోపాటు మంత్రులు ఆయా ప్రాంతాల్లో ఎప్పుడెప్పుడు పర్యటించాలనే విషయాలపై ఆయన వారితో చర్చించారు. కాంగ్రెస్ వీక్‌గా ఉన్న జిల్లాల ఇన్‌ఛార్జి మంత్రులతో ఎప్పటికప్పుడు సమావేశాలు నిర్వహించాలంటూ బాధ్యులకు సూచించారు. విభేధాలను పక్కనబెట్టి అందరూ సమిష్టిగా పని చేయాలని, ఓట్లు చీలకుండా చూడాలని కోరారు. పాత, కొత్త నేతలు సమన్వయంతో పని చేయటం ద్వారా కచ్చితంగా అన్ని స్థానాల్లోనూ పార్టీని గెలిపించాలంటూ దిశా నిర్దేశం చేశారు. ఈ బాధ్యత కచ్చితంగా పార్లమెంటు నియోజకవర్గ బాధ్యులదేనని స్పష్టం చేశారు. ఎన్నికలు అయిపోయేంత వరకు ఇన్‌ఛార్జిలందరూ జిల్లాలు, నియోజకవర్గాల్లో ఉండి మానిటరింగ్ చేయాలంటూ సీఎం ఈ సందర్భంగా ఆదేశించినట్టు సమాచారం. ఏమైనా సమస్యలు ఉంటే ఎప్పటికప్పుడు పీసీసీ చీఫ్‌తోపాటు వార్ రూమ్ దృష్టికి తీసుకురావాలంటూ ఆయన సూచించినట్టు తెలిసింది.

## మోహన్ బాబు, మంచు విష్ణుపై కిడ్నాప్ కేసు కలకలం



మోహన్ బాబు యూనివర్సిటీలో అధిక ఫీజులతో దోపిడీ జరుగుతోందని ప్రశ్నించిన విద్యార్థి నేతలపై జరిగిన దాడి, కిడ్నాప్ వ్యవహారం తిరుపతిలో తీవ్ర ఉద్రిక్తతకు దారితీసింది. యూనివర్సిటీ యాజమాన్య తీరును నిరసిస్తూ జిల్లా కలెక్టరేట్ వద్ద ధర్నాకు వెళ్తున్న ఎస్ఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి అక్బర్, ఎస్వీయూ నాయకుడు వినోద్‌లను అడ్డుకుని కిడ్నాప్ చేసిన ఘటనలో మోహన్ బాబు, మంచు విష్ణు పీఆర్వో సతీష్‌తో పాటు మరికొందరిపై తిరుచానూరు పోలీసులు కేసు నమోదు చేశారు. దాదాపు 30 మంది మద్దతుదారులు పలు వాహనాల్లో వచ్చి నడిరోడ్డుపై బీభత్సం సృష్టించి, విద్యార్థి నేతలను బలవంతంగా వాహనాల్లో ఎక్కించుకుపోయారని ఆరోపణలు వచ్చాయి. ఈ ఘటనను సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కందరపు మురళి తీవ్రంగా ఖండించారు. తక్షణమే ఏఎస్పీ రవి మనోహర్, ఎస్పీ సుబ్బారాయుడుకు ఫిర్యాదు చేయడంతో పోలీసులు రంగంలోకి దిగారు. నిందితుల వాహనాలను స్వాధీనం చేసుకుని, బాధితుల ఆచూకీ కోసం ప్రత్యేక బృందాలతో గాలింపు చేపట్టారు. విద్యార్థులకు ఏమైనా జరిగితే తీవ్ర పరిణామాలు ఉంటాయని ప్రజా సంఘాలు హెచ్చరించాయి. జిల్లా ఎస్పీ సుబ్బారాయుడు ఈ ఘటనపై సీరియస్‌గా స్పందించారు. చట్టం ముందు అందరూ సమానమేనని, దాడికి పాల్పడిన వారు ఎంతటి వారైనా ఉపేక్షించేది లేదని స్పష్టం చేశారు. విద్యాసంస్థలో జరుగుతున్న అవకతవకలను ప్రశ్నించినందుకే విద్యార్థి నేతలపై ఈ స్థాయి దౌర్జన్యానికి దిగడంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. గతంలో మంచు మనోజ్ తల్లిదండ్రుల సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చినప్పటికీ, క్షేత్రస్థాయిలో పరిస్థితులు భిన్నంగా ఉన్నాయని, ప్రశ్నించే గొంతులను అణిచివేస్తున్నారని విద్యార్థి సంఘాలు మండిపడుతున్నాయి. ప్రజాస్వామ్య పద్ధతిలో నిరసన తెలిపే హక్కును కాలరాయడం సరికాదని విద్యావేత్తలు అభిప్రాయపడుతున్నారు.

### లోక్‌సభలో తీవ్ర ఉద్రిక్తత...

# 8 మంది కాంగ్రెస్ ఎంపీల సస్పెన్షన్

ఢిల్లీ: పార్లమెంట్ బడ్జెట్ సమావేశాల్లో మంగళవారం తీవ్ర ఉద్రిక్త వాతావరణం నెలకొంది. సభలో ప్రవర్తనా నియమావళిని ఉల్లంఘించి, నిరసన పేరుతో కాగితాలను చింపి స్పీకర్ చైర్ వైపు విసిరారన్న కారణంతో 8 మంది కాంగ్రెస్ ఎంపీలను లోక్‌సభ నుంచి సస్పెండ్ చేశారు. ప్రస్తుత బడ్జెట్ సమావేశాలు ముగిసే వరకు ఈ సస్పెన్షన్ అమల్లో ఉంటుందని స్పీకర్ ప్యానెల్ ఆఫ్ చైర్ పర్సన్స్ లో ఒకరైన దిలీప్ సైకియా (ప్యానెల్ స్పీకర్) ప్రకటించారు. సస్పెన్షన్ వేటు పడిన వారిలో అమరీందర్ సింగ్ రాజా వారింగ్, మాణికం ఠాగూర్, గురుజీత్ సింగ్ ఆజులా, హిబి ఈడెన్, చామల కిరణ్ కుమార్ రెడ్డి, ప్రశాంత్ యాదవరావు పడోలే, ఎస్.వెంకటేశన్, డీన్ కురియకోస్ ఉన్నారు. "ప్రతిపక్షాలకు తమ గళం వినిపించే హక్కు ఉంది, కానీ నిరసన పేరుతో సభను పూర్తిగా స్తంభింపజేయడం, ప్రొసీడింగ్స్ జరగకుండా అడ్డుకోవడం పార్లమెంటరీ సంప్రదాయాలకు విరుద్ధం" అని దిలీప్ సైకియా వ్యాఖ్యానించారు. అంతకుముందు, సరిహద్దుల్లో చైనా ఆక్రమణల అంశంపై చర్చించాలంటూ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ పట్టుబట్టారు. మాజీ ఆర్మీ చీఫ్ ఎంఎం నరవణే రాసిన పుస్తకానికి సంబంధించిన ఓ మ్యాగజైన్ కథనాన్ని రాహుల్ ప్రస్తావించారు. అయితే, ధృవీకరించని వార్తా కథనాలను సభలో చదవకూడదని ప్యానెల్ స్పీకర్ సైకియా అభ్యంతరం తెలపడంతో వాగ్వాదం చోటుచేసుకుంది. ఈ సందర్భంగా రాహుల్ స్పందిస్తూ.. "మాట్లాడటానికి నాకు ఎవరి అనుమతి అవసరం లేదు. నేను ప్రతిపక్ష నాయకుడిని.. నాకు పర్మిషన్ అనే పదం వాడటం సరికాదు" అని మండిపడ్డారు. తూర్పు లడఖ్‌లో ఘర్షణల వల్ల భారత సైనికులు ప్రాణాలు కోల్పోయారని, దీనిపై ప్రధాని స్పందన ఏమిటని రాహుల్ ప్రశ్నించారు. ఈ సమయంలోనే అధికార, విపక్ష సభ్యుల మధ్య తీవ్ర స్థాయిలో మాటల యుద్ధం జరిగింది. విపక్ష సభ్యులు వెల్ లోకి దూసుకెళ్లి నినాదాలు చేశారు. గందరగోళం మధ్యే సస్పెన్షన్ తీర్మానాన్ని ఆమోదించిన అనంతరం సభను మంగళవారానికి వాయిదా వేశారు. టీడీపీ ఎంపీ జి.ఎం. హరీశ్ బాలయోగి రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాద తీర్మానంపై మాట్లాడేందుకు ప్రయత్నించినప్పటికీ, సభలో నిరసనల హోరు తగ్గకపోవడంతో ప్రసంగం కొనసాగలేదు.

## సహనమే భారత్ ను గెలిపించిందన్న మోదీ

ఢిల్లీ: విదేశాలతో వాణిజ్య చర్చలకు సంబంధించి ప్రభుత్వం స్థిరమైన వైఖరితో ఉంటుందని ప్రధాని నరేంద్ర మోదీ పేర్కొన్నారు. అమెరికాతో చారిత్రాత్మక ట్రేడ్ డీల్ కుదిరిన సందర్భంగా ఎన్డీయే కూటమి సమావేశంలో మోదీ మాట్లాడారు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ భారత్ పై టారిఫ్ లు విధించడంపై ఎన్నో విమర్శలు ఎదుర్కొన్నట్లు తెలిపారు. సుంకాల విషయంలో తమ ప్రభుత్వాన్ని విమర్శలు చుట్టుముట్టాయని గుర్తుచేసుకున్నారు. అయితే, ప్రభుత్వం మాత్రం సహనంతో వేచి ఉందని, దాని ఫలితం ఈ రోజు అందరూ చూస్తున్నారని పేర్కొన్నారు. తాజాగా కుదిరిన ట్రేడ్ డీల్ తో అనుకూల ఆర్థిక వాతావరణం నెలకొందన్నారు. ప్రపంచ దేశాల మధ్య కొనసాగుతున్న ఉద్రిక్తతల వల్ల ఎన్నో దేశాలు వాణిజ్యపరంగా సమస్యలు ఎదుర్కొంటున్నప్పటికీ.. భారత్ మాత్రం ప్రయోజనం పొందుతోందని ప్రధాని మోదీ పేర్కొన్నారు.

## ఢిల్లీ చేరుకున్న నారా లోకేశ్...

### రేపు కేంద్రమంత్రులతో వరుస సమావేశాలు

ఢిల్లీ: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఐటీ, ఎలక్ట్రానిక్స్, విద్యాశాఖల మంత్రి నారా లోకేశ్ ఢిల్లీ చేరుకున్నారు. ఈ సందర్భంగా ఆయనకు టీడీపీ ఎంపీలు ఘనస్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన టీడీపీ ఎంపీలతో సమావేశమై పలు అంశాలపై చర్చించారు. కాగా, రాష్ట్రానికి సంబంధించిన కీలక అభివృద్ధి పనులపై చర్చించేందుకు, నిధులు రాబట్టేందుకు లోకేశ్ రేపు (ఫిబ్రవరి 4) కేంద్ర మంత్రులతో వరుసగా సమావేశం కానున్నారు. ఈ రాత్రికి ఢిల్లీలోనే బస చేయనున్న లోకేశ్, బుధవారం పార్లమెంట్ భవనంలో పలువురు కేంద్ర మంత్రులతో కీలక భేటీలు జరపనున్నారు. ఈ పర్యటనలో ప్రధానంగా రాష్ట్రంలో ఐటీ రంగం విస్తరణ, ఎలక్ట్రానిక్స్ పరిశ్రమల ఏర్పాటు, విద్యారంగ సంస్కరణలు వంటి అంశాలపై చర్చించనున్నారు. వీటితో పాటు ఏపీ విభజన చట్టంలోని హామీల అమలు, అమరావతి రాజధాని నిర్మాణానికి నిధులు, కొత్త ప్రాజెక్టుల మంజూరు వంటి విషయాలపై కేంద్ర ప్రభుత్వంతో సంప్రదింపులు జరపనున్నారు.ఇటీవల కేంద్ర బడ్జెట్‌లో ఏపీకి కేటాయించిన రాయితీలు, మౌలిక సదుపాయాల కల్పనపై సంబంధిత శాఖల మంత్రులతో లోకేశ్ చర్చించనున్నారు. అలాగే, రాష్ట్రంలో పురోగతిలో ఉన్న రూ.92,649 కోట్ల పనుల వివరాలను కేంద్రం దృష్టికి తీసుకెళ్లే అవకాశం ఉంది. హైదరాబాద్‌బెంగళూరు, హైదరాబాద్‌చెన్నై హై స్పీడ్ రైల్వే కారిడార్ల అంశంపై కేంద్ర రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్‌తో సమావేశమయ్యే అవకాశం కూడా ఉంది. కీలక సమావేశాల అనంతరం బుధవారం రాత్రికి ఆయన తిరిగి ఉండవల్లిలోని నివాసానికి చేరుకోనున్నారు.

# ఈ నెలాఖరులోనే రాష్ట్ర బడ్జెట్ !

హైదరాబాద్:తెలంగాణ రాష్ట్ర బడ్జెట్ సమావేశాలను ఈ నెలాఖరులో నిర్వహించాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రాథమికంగా నిర్ణయించారు. ఈ మేరకు అధికారులకు తగిన సూచనలు చేశారు. వివిధ శాఖల ఉన్నతాధికారులతో సోమవారం రాత్రి సమావేశమైన సీఎం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో శాఖల వారీగా బడ్జెట్ ప్రతిపాదనలపై చర్చించారు. ఈ నెల 1న పార్లమెంట్‌లో కేంద్ర బడ్జెట్ ప్రవేశపెట్టిన నేపథ్యంలో రాష్ట్రానికి సంబంధించిన కేంద్ర నిధులపై కూడా ఆయన సమీక్షించారు. ఈ నెల చివరి వారంలో అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు ప్రారంభమై వారంపాటు కొనసాగే అవకాశాలు ఉన్నట్లు విశ్వసనీయ వర్గాల సమాచారం. ఈ నేపథ్యంలో బడ్జెట్‌పై ఉత్కంఠ నెలకొంది.

*** గతేడాది రూ. 3.04 లక్షల కోట్ల అంచనా వ్యయంతో బడ్జెట్**

తెలంగాణ రాష్ట్ర బడ్జెట్ (20252026) అనేది తెలంగాణ రాష్ట్రానికి సంబంధించిన బడ్జెట్. తెలంగాణ శాసనసభ సమావేశాల్లో భాగంగా 2025 మార్చి 12న బడ్జెట్ సమావేశాలు ప్రారంభమయ్యాయి. తెలంగాణ రాష్ట్ర ఆర్థిక శాఖామంత్రి మల్లు భట్టి విక్రమార్క అసెంబ్లీలో 2025 మార్చి 19న బడ్జెట్ ను ప్రవేశపెట్టారు. రూ.3,04,965 కోట్ల అంచనా వ్యయంతో ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో రెవెన్యూ వ్యయం రూ.2,26,982 కోట్లు కాగా, మూలధన వ్యయం రూ.36,504 కోట్లుగా ఉంది. రాష్ట్రం అప్పులు రూ.5,04,814 కోట్లుగా పేర్కొన్నారు ఆరు గ్యారంటీల అమలు కోసం బడ్జెట్‌లో 56,084 కోట్లను ప్రభుత్వం కేటాయించింది.

*** ఈ ఏడాది కేటాయింపులపై ఉత్కంఠ..**

రాష్ట్ర బడ్జెట్‌ను ప్రవేశపెట్టనున్న నేపథ్యంలో కేటాయింపులపై సర్వత్రా ఆసక్తి నెలకొంది. ఈ ఏడాది బడ్జెట్ రూ.3.26 లక్షల కోట్లుగా ఉండే అవకాశం ఉంది. సంక్షేమ పథకాలకు కేటాయింపులతో పాటు, ఆరు గ్యారెంటీల అమలుపై ఉత్కంఠ నెలకొంది. వృద్ధులు, వితంతువులు, వికలాంగులు, ఒంటరి మహిళలకు ఇచ్చే పెన్షన్‌ను రూ.రెండు వేల నుంచి రూ. నాలుగు వేలకు పెంచుతామని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చి రెండేళ్లు గడిచిపోయిన నేపథ్యంలో ఇప్పటికైనా పెన్షన్‌ల పెంపు సరిపడా నిధులు కేటాయిస్తారో లేదోనని లబ్ధిదారులు ఆశగా ఎదురుచూస్తున్నారు. మరోవైపు కీలకమైన వ్యవసాయం, విద్య, వైద్య రంగాలకు కేటాయింపులు సచివాలయ వర్గాల్లో చర్చనీయాంశమయ్యాయి. రెండేళ్లకు పైగా పాలనలో ఉద్యోగ భర్తీ నోటిఫికేషన్లు విడుదల చేయకపోవడంతో ఆగ్రహంగా ఉన్న నిరుద్యోగులను ప్రసన్నం చేసుకునేందుకు నిరుద్యోగ భృతిని ప్రకటిస్తారని కొంతమంది భావిస్తుండగా.. మరికొంత మంది ఆ ప్రతిపాదలను కొట్టిపారేస్తున్నారు.

*** కేంద్రబడ్జెట్‌లో తెలంగాణకు అప్రాధాన్యం..**

ఇటీవల ప్రవేశపెట్టిన కేంద్రబడ్జెట్‌లో తెలంగాణకు అంతగా ప్రాధాన్యం దక్కలేదు. బడ్జెట్‌లో తెలంగాణ కోరిన 47 డిమాండ్లను కేంద్రం పట్టించుకోలేదు. కేవలం మూడు రైల్వే స్పీడ్ కారిడార్‌లను ప్రకటించి, చేతులు దులుపుకుంది. ఆ కారిడార్లు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌ల మధ్య రవాణాను వేగవంతం చేసేందుకు ఉద్దేశించినవి కావడం గమనార్హం.

*** బడ్జెట్‌లో తెలంగాణ కోరిన 47 డిమాండ్లు ఇవే..**

ఈ డిమాండ్లలో హైదరాబాద్ నగరాభివృద్ధి, మౌలిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వం ప్రాధాన్యతనిచ్చింది.

*** కీలక ప్రాజెక్టులు – నిధుల అంచనా**

* గోదావరిమూసీ అనుసంధానం: మూసీ నది ప్రక్షాళన మరియు పునరుజ్జీవనంలో భాగంగా గోదావరి జలాలను మూసీకి అనుసంధానించే ప్రాజెక్టు కోసం ₹6,000 కోట్లు కేటాయించాలని కోరింది.
* మురుగునీటి మాస్టర్ ప్లాన్: హైదరాబాద్‌లో పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా మురుగునీటి వ్యవస్థను ఆధునీకరించేందుకు ₹17,212 కోట్లు కావాలని అభ్యర్థించింది.
* మెట్రో రైల్ ఫేజ్ 2: హైదరాబాద్ మెట్రో రెండో దశ విస్తరణ కోసం కేంద్రం తన వాటాగా నిధులు మంజూరు చేయాలని డిమాండ్ చేసింది.

## ఎస్ఎఫ్‌డీఆర్ పరీక్ష విజయవంతం..

ఒడిశా: భారత రక్షణ పరిశోధన మరియు అభివృద్ధి సంస్థ (డీఆర్‌డీవో) మరో కీలక విజయాన్ని అందుకుంది. సాలిడ్ ఫ్యూయల్ డక్టెడ్ రామ్‌జెట్ (ఎస్ఎఫ్‌డీఆర్) టెక్నాలజీని ఒడిశాలోని చాందీపూర్ ఇంటిగ్రేటెడ్ టెస్ట్ రేంజ్ (ఐటీఆర్) నుంచి విజయవంతంగా ప్రదర్శించింది. ఈ పరీక్షతో సుదూర గగనతల క్షిపణుల (ఎయిర్ టు ఎయిర్ మిసైల్స్) తయారీలో భారత్ స్వయంసమృద్ధి దిశగా మరో ముందడుగు వేసినట్లయింది. మంగళవారం ఉదయం 10:45 గంటల సమయంలో ఈ పరీక్షను నిర్వహించారు. ముందుగా గ్రౌండ్ బూస్టర్ సాయంతో క్షిపణి వ్యవస్థను నిర్దేశిత వేగానికి చేర్చారు. ఆ తర్వాత, నాజిల్‌లెస్ బూస్టర్, రామ్‌జెట్ మోటార్ వంటి అన్ని ఉప వ్యవస్థలు ప్రణాళిక ప్రకారం అత్యంత కచ్చితత్వంతో పనిచేశాయి. ఈ పరీక్షకు సంబంధించిన పూర్తి సమాచారాన్ని ఐటీఆర్‌లో ఏర్పాటు చేసిన ట్రాకింగ్ వ్యవస్థల ద్వారా నమోదు చేసి, ధృవీకరించారు. ఈ అత్యాధునిక టెక్నాలజీ విజయవంతం కావడంతో భారత్‌కు గగనతలంలో గణనీయమైన వ్యూహాత్మక ప్రయోజనం లభించనుంది. శత్రు విమానాలను చాలా దూరం నుంచే అడ్డుకునే సామర్థ్యం భారత వాయుసేనకు అందుబాటులోకి వస్తుంది. దీంతో ఈ పరిజ్ఞానం కలిగిన కొద్ది దేశాల సరసన భారత్ చేరింది. డీఆర్‌డీవోకు చెందిన డీఆర్‌డీఎల్, హెచ్‌ఈఎంఆర్ఎల్, ఆర్‌సీఐ వంటి ప్రయోగశాలలు సంయుక్తంగా ఈ పరీక్షను నిర్వహించాయి.

## ఏలూరు జిల్లాలో 500 ఎకరాల్లో కోకో సిటీ: సీఎం చంద్రబాబు

ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ రంగంలో విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుడుతూ, ఏలూరు జిల్లాలో సుమారు 500 ఎకరాల విస్తీర్ణంలో అంతర్జాతీయ స్థాయిలో 'కోకో సిటీ' ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులను ఆదేశించారు. వ్యవసాయం, దాని అనుబంధ రంగాలపై సచివాలయంలో ఉన్నతాధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఈ కీలక నిర్ణయం తీసుకున్నారు. ఈ కోకో సిటీలో సాగు, ప్రాసెసింగ్, మార్కెటింగ్ వంటి అన్ని ప్రక్రియలు ఒకేచోట ఉండేలా, ప్రపంచస్థాయి ప్రమాణాలతో దీనిని అభివృద్ధి చేయాలని ఆయన స్పష్టం చేశారు. దీనితో పాటు మామిడి, జీడిమామిడి, కొబ్బరి తోటల్లో కోకోను అంతర పంటగా సాగు చేసేలా రైతులను ప్రోత్సహించాలని సూచించారు.

**ప్రకృతి వ్యవసాయ హబ్‌గా ఏపీ**

రాష్ట్రాన్ని దేశంలోనే అతిపెద్ద ప్రకృతి వ్యవసాయ క్షేత్రంగా తీర్చిదిద్దాలని ముఖ్యమంత్రి చంద్రబాబు ఆకాంక్షించారు. ప్రస్తుతం రాష్ట్రంలో 18 లక్షల మంది రైతులు 20 లక్షల ఎకరాల్లో ప్రకృతి సేద్యం చేసేందుకు ముందుకొచ్చారని, ఈ స్ఫూర్తిని కొనసాగించాలని అన్నారు. 203031 నాటికి 40 లక్షల మంది రైతులను భాగస్వాములను చేస్తూ, సాగు విస్తీర్ణాన్ని 50 లక్షల ఎకరాలకు పెంచాలని లక్ష్యంగా నిర్దేశించారు. రసాయన ఎరువుల వాడకాన్ని పూర్తిగా తగ్గించడం ద్వారా రైతులకు పెట్టుబడి వ్యయం తగ్గి, వారి ఉత్పత్తులకు అధిక ధర లభిస్తుందని వివరించారు. ప్రకృతి సాగు ఉత్పత్తుల నాణ్యతను ధ్రువీకరించేందుకు సర్టిఫికేషన్, ట్రేసబిలిటీ సదుపాయాలను ఏప్రిల్ నాటికి సిద్ధం చేయాలన్నారు. సుభాష్ పాలేకర్ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా రైతులకు శిక్షణా తరగతులు నిర్వహిస్తామని తెలిపారు.

**పంటల వైవిధ్యంపై ప్రత్యేక దృష్టి**

సంప్రదాయ పంటలతో పాటు, వాణిజ్యపరంగా లాభదాయకమైన పంటల సాగును ప్రోత్సహించాలని సీఎం సూచించారు. ఇందులో భాగంగా, లంబసింగి ప్రాంతంలో స్థానిక గిరిజనుల భాగస్వామ్యంతో పబ్లిక్‌ప్రైవేట్ పార్ట్‌నర్‌షిప్ (పీపీపీ) విధానంలో కుంకుమపువ్వు సాగు చేపట్టే సంస్థలకు అనుమతులు ఇవ్వాలని ఆదేశించారు. అరటి ఉత్పత్తిలో దేశంలో రెండో స్థానంలో ఉన్నా, ఎగుమతుల్లో వెనుకబడ్డామని, ఇకపై ఎగుమతులపై ప్రత్యేక దృష్టి సారించాలని అన్నారు.

**అనుబంధ రంగాలకు చేయూత**

వ్యవసాయంతో పాటు అనుబంధ రంగాలైన ఆక్వా, పౌల్ట్రీ పరిశ్రమల బలోపేతానికి కూడా ముఖ్యమంత్రి పలు కీలక సూచనలు చేశారు. ఆక్వా రైతులు తమ సాగు వివరాలను తప్పనిసరిగా నమోదు చేసుకునే విధానాన్ని అమలు చేయాలన్నారు.

## హైదరాబాద్ రైల్వే హబ్ కాబోతుంది

హైదరాబాద్: హైదరాబాద్ రైల్వే హబ్ కాబోతుందని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి అన్నారు. హైదరాబాద్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, 2026 27 బడ్జెట్ ఎన్నికల కోసం కాకుండా వికసిత్ భారత్ 2047 కోసం తీసుకువచ్చిన బడ్జెట్ అన్నారు. ఉచితాలు ప్రవేశపెట్టడం కోసమే బడ్జెట్ అన్నట్లుగా రాజకీయ పార్టీలు ప్రజల్లో తప్పుడు ప్రచారం చేస్తున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజలు ఆశిస్తున్న సుస్థిర ప్రగతికి దోహదపడేలా బడ్జెట్ ఉందని అన్నారు. వీబీ జీ రామ్ జీ ద్వారా ఉపాధి హామీ పథకాన్ని నిర్వీర్యం చేశారని కాంగ్రెస్ తప్పుడు ప్రచారం చేయడం సరికాదని అన్నారు. ఈ పథకానికి బడ్జెట్‌లో 9 శాతం నిధులు కేటాయించినట్లు తెలిపారు. ప్రధానమంత్రి ఆవాస్ యోజన కింద తెలంగాణకు 4.30 లక్షల ఇళ్లు కేటాయించామని, మేడారం జాతరకు కేంద్రం రూ.3.70 కోట్లు కేటాయించిందని అన్నారు. నైనీ బొగ్గు గనుల వ్యవహారంలో తెలంగాణ మంత్రులు రెండు వర్గాలుగా విడిపోయారని విమర్శించారు. బీఆర్ఎస్, కాంగ్రెస్ దగా వల్లే సింగరేణి భ్రష్టు పట్టిందని ఆరోపించారు. సింగరేణిని ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీగా కేసీఆర్ మార్చుకున్నారని, కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక కాంగ్రెస్ తన ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీగా మార్చుకుందని విమర్శించారు.

## బిజెపిలో పలువురి చేరిక

* **పార్టీలోకి ఆహ్వానించిన మాజీ ఎమ్మెల్యే బేతి సుభాష్ రెడ్డి**



చౌటుప్పల్, ప్రజాస్ఫూర్తి: బిజెపి నాయకుడు ఆలె చిరంజీవి ఆధ్వర్యంలో చౌటుప్పల్ మున్సిపల్ పరిధి తంగడపల్లి గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకుడు, మాజీ ఎంపీటీసీ గ్యార కృష్ణ, గ్యార సుధాకర్, ఇట్టగొని రమేష్ లు వారి అనుచరులతో కలిసి మాజీ ఎమ్మెల్యే బేతి సుభాష్ రెడ్డి గారి సమక్షంలో మంగళవారం బీజేపీ తీర్థం పుచ్చుకున్నారు. కాషాయ కండువాలను కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా బేటి సుభాష్ రెడ్డి మాట్లాడుతూ చౌటుప్పల్ మున్సిపాలిటీలో కాషాయ జెండా ఎగడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో చౌటుప్పల్ మున్సిపల్ అధ్యక్షురాలు కడారి కల్పన యాదవ్, సీనియర్ నాయకులు దూడల భిక్షం గౌడ్, రమణగోనీ శంకర్, ముత్యాల భూపాల్ రెడ్డి, గుజ్జుల సురేందర్ రెడ్డి, పోలోజు శ్రీధర్ బాబు, చీకూరి ప్రభాకర్, తొర్పునూరి లక్ష్మణ్, బత్తుల జనార్ధన్, చీకూరి వెంకటేష్, సిల్వేరు సురేష్, తోకల సాయి, కర్తాల శ్రీను తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా అసెంబ్లీ స్థాయి సీఎం కప్ క్రీడా పోటీలు



ప్రజా స్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: కొత్తగూడెం నియోజకవర్గ స్థాయి సీఎం కప్ క్రీడా పోటీలను మంగళవారం స్థానిక ప్రకాశం స్టేడియం గ్రౌండ్‌లో ఘనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జడ్పీ సీఈవో, జిల్లా విద్యాశాఖ అధికారి నాగలక్ష్మి, డీవైఎస్ఓ పరంధామ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా లక్ష్మీదేవిపల్లి ఎంఈఓ కృష్ణయ్య, చుంచుపల్లి ఎంఈఓ బాలాజీ, సుజాతనగర్ ఎంఈఓ లీల, ఎంఈఓ మధురవాణి, వివిధ క్లస్టర్ ఇన్‌చార్జీలు పాల్గొన్నారు. ఎస్‌జీఎఫ్ సెక్రటరీ నరేష్, డీవైఎస్ఓ కార్యాలయ సిబ్బంది పులి లక్ష్మయ్య ఆధ్వర్యంలో క్రీడా పోటీలను సక్రమంగా నిర్వహించారు. ప్రకాశ్ స్టేడియం గ్రౌండ్‌లో మండల స్థాయిలో ఎంపికైన విద్యార్థులకు అసెంబ్లీ స్థాయిలో కబడ్డీ, ఖో ఖో, వాలీబాల్ క్రీడా పోటీలను నిర్వహించారు. ఈ పోటీలలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులను జిల్లా స్థాయి క్రీడా పోటీలకు పంపించనున్నట్లు అధికారులు తెలిపారు.

## ఉచితవైద్య శిబిరానికి మంచి స్పందన



ప్రజాస్ఫూర్తి, కుత్బుల్లాపూర్: సూరారం విశ్వకర్మ కాలనీ లో సీఎంఆర్ హాస్పిటల్ వారి ఆధ్వర్యంలో ఇంచార్జ్ దుర్గ ప్రసాద్ రెడ్డి అధ్యక్షతన మంగళవారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి మంచి స్పందన లభించింది. ఈ కార్యక్రమంలో విశ్వకర్మ కాలని అధ్యక్షులు, బిఆర్ఎస్ నియోజకవర్గ సీనియర్ నాయకులు కె.శ్రీనివాస్ రెడ్డి, దొడ్ల శ్రీనివాస్,కే. నర్సింహా, ఎస్. జీవన్ రెడ్డి, విశ్వకర్మ సంఘం అధ్యక్షులు కృష్ణమాచారి, మల్లేష్,మస్తుదన్ రెడ్డి 'వెంకట్,రాములు, కిరణ్, మురళి,జిలాని గోపాల్ రెడ్డి, సందీప్, లత, రమ, పాల్గొన్నారు. ఈ ఉచిత వైద్య శిబిరం లో వృద్ధులు, మహిళలు కాలనీవాసులు వైద్య పరీక్షలు చేయించుకోగా వారి ఆరోగ్య పరిస్థితులను బట్టి వైద్య బృందం మందులు పంపిణి చేశారు.ఈ సందర్భంగా శ్రీనివాస్ రెడ్డి, జీవన్ రెడ్డి మాట్లాడుతూ విశ్వకర్మ కాలనీలో పేద,మధ్యతరగతి కుటుంబాలు ఎన్నో ఉన్నాయని, ఇలాంటి వైద్య శిబిరాలు కాలనీ ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా వుంటాయన్నారు.

# ఎక్సైజ్ కానిస్టేబుల్ సౌమ్య హత్యను ఖండిస్తున్నాం

* **డ్రగ్స్ గంజాయి మాఫియాపై కఠిన చర్యలు తీసుకోవాలి**
* **ఆనగంటి వెంకటేష్**




చౌటుప్పల్, ప్రజాస్ఫూర్తి: నిజామాబాద్ జిల్లా మోపాల్ గ్రామానికి చెందిన ఎక్సైజ్ మహిళా కానిస్టేబుల్ సౌమ్యను డ్రగ్స్, గంజాయి మాఫియా అతి దారుణంగా కార్ యాక్సిడెంట్ చేసి హత్య చేయడాన్ని ఖండిస్తున్నామని, హత్య చేసిన గంజాయి స్మగ్లర్లను కఠినంగా శిక్షించాలని డివైఎఫ్ఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆనగంటి వెంకటేశ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. చౌటుప్పల్ మండల కేంద్రం బస్టాండ్ చౌరస్తాలో భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య (డివైఎఫ్ఐ) ఆధ్వర్యంలో గంజాయి స్మగ్లర్ల చేతిలో హత్య గావింపబడిన ఎక్సైజ్ కానిస్టేబుల్ సౌమ్యకు మంగళవారం నివాళులర్పించారు. ఈ సందర్భంగా డివైఎఫ్ఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆనగంటి వెంకటేష్ మాట్లాడుతూ జనవరి 23న గంజాయి సరఫరా చేస్తున్నారన్న సమాచారం మేరకు నిజామాబాద్ శివారులోని మాధవ నగర్ వద్ద ఎక్సైజ్ పోలీసులు వాహనాల తనిఖీ చేపట్టారు ఈ క్రమంలో ఎక్సైజ్ పోలీసులను చూసిన గంజాయి స్మగ్లింగ్ ముఠా సభ్యులు పారిపోయేందుకు ప్రయత్నించగా దీంతో ఎక్సైజ్ కానిస్టేబుల్ సౌమ్య వారిని పట్టుకునే ప్రయత్నంలో గంజాయి ముఠా సభ్యుల తమ కారుతో ఎక్సైజ్ కానిస్టేబుల్ సౌమ్యను ఢీకొట్టడంతో ఆమె తీవ్రంగా గాయపడ్డారని ఎనిమిది రోజులపాటు సౌమ్య ఆసుపత్రిలో మృత్యువుతో పోరాడి విధి నిర్వహణలో అసాధారణ తెగువ ప్రదర్శించి అసువులు బాసిన ఎక్సైజ్ కానిస్టేబుల్ సౌమ్య కుటుంబానికి రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాలుగా కుటుంబాన్ని ఆదుకోవాలని ఆయన రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. పోలీసులకే రక్షణ లేనప్పుడు సామాన్య ప్రజల పరిస్థితి ఏంటని ఆయన రాష్ట్ర ప్రభుత్వాన్ని అధికారులను ప్రశ్నించారు. రాష్ట్రంలో డ్రగ్స్ లేకుండా చేస్తామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారు చెబుతున్నప్పటికీ, క్షేత్రస్థాయిలో పరిస్థితి భిన్నంగా ఉందన్నారు. ప్రతి జిల్లాలో మాదకద్రవ్యాల సరఫరా విచ్చలవిడిగా సాగుతోందన్నారు. ప్రభుత్వం వీటిని అరికట్టడంలో విఫలమవుతోందన్నారు. కానిస్టేబుల్ సౌమ్య హత్య కేసులో నిందితులకు కఠిన శిక్ష పడేలా చర్యలు తీసుకోవాలన్నారు. కేవలం అరెస్టులకే పరిమితం కాకుండా, డ్రగ్స్ నెట్‌వర్క్‌ను పూర్తిగా వేళ్లతో సహా పెకిలించాలి. పోలీస్ ఉన్నత అధికారుల మాఫియా అంతానికి కఠినమైన కార్యాచరణ చేపట్టాలి. ఈ ఘాతుకానికి పాల్పడిన నిందితులను శిక్షించేందుకు తక్షణమే ఫాస్ట్ ట్రాక్ కోర్టును ఏర్పాటు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నాము. ఈ కార్యక్రమంలో డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు పల్లె మధు కృష్ణ, జిల్లా ఉపాధ్యక్షుడు ఎండి ఖయ్యూం, ప్రజా సంఘాల నాయకులు ఎండి పాషా, బండారు నరసింహ, బత్తుల శంకర్, డివైఎఫ్ఐ నాయకులు ఎండి కాశీం, రొడ్డ భగత్ సింగ్, తొర్పునూరి మల్లేష్, శంకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## పకడ్బందీగా.. ఇంటర్మీడియట్ ప్రయోగ పరీక్షలు నిర్వహించాలి

* **డీఐఈఓ వెంకటేశ్వరరావు**

ప్రజా స్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: జిల్లాలో నిర్వహిస్తున్న ఇంటర్మీడియట్ వార్షిక ప్రయోగ పరీక్షలను నిబంధనల ప్రకారం పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా ఇంటర్మీడియట్ విద్యాశాఖ అధికారి వెంకటేశ్వరరావు సంబంధిత అధికారులను ఆదేశించారు. పరీక్షలు సజావుగా కొనసాగుతున్న నేపథ్యంలో మంగళవారం ములకలపల్లి, అశ్వరావుపేట మండలాల్లోని పలు జూనియర్ కళాశాలలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ములకలపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రయోగ పరీక్షల నిర్వహణ, ప్రయోగశాలల ఏర్పాట్లు, విద్యార్థుల హాజరు నమోదు, ప్రశ్నపత్రాల భద్రత వంటి అంశాలను పరిశీలించారు. అనంతరం అశ్వరావుపేటలోని ఒక ప్రైవేట్ జూనియర్ కళాశాలను తనిఖీ చేసి పరీక్షల నిర్వహణను సమీక్షించారు. రెండో రోజు నిర్వహించిన పరీక్షల హాజరు వివరాలను వెల్లడిస్తూ, ఉదయం సాధారణ విభాగానికి కేటాయించిన 1,295 మందిలో 1,263 మంది హాజరై 32 మంది గైర్హాజరయ్యారని తెలిపారు. వృత్తి విద్య విభాగానికి కేటాయించిన 1,386 మందిలో 1,207 మంది హాజరై 179 మంది గైర్హాజరయ్యారని చెప్పారు. మొత్తం ఉదయం జరిగిన పరీక్షలకు 2,681 మందికి గాను 2,470 మంది హాజరై 211 మంది గైర్హాజరయ్యారని వెల్లడించారు. మధ్యాహ్నం



జరిగిన పరీక్షలలో సాధారణ విభాగానికి కేటాయించిన 880 మందిలో 861 మంది హాజరై 19 మంది గైర్హాజరయ్యారని, వృత్తి విద్య విభాగానికి కేటాయించిన 1,365 మందిలో 1,308 మంది హాజరై 58 మంది గైర్హాజరయ్యారని తెలిపారు. మొత్తం మధ్యాహ్నం జరిగిన పరీక్షలకు 2,245 మందికి గాను 2,169 మంది హాజరై 77 మంది గైర్హాజరయ్యారని పేర్కొన్నారు.ప్రయోగ పరీక్షలు పూర్తయ్యే వరకు అన్ని కేంద్రాల్లో నిరంతర పర్యవేక్షణ కొనసాగించాలని, విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా అవసరమైన ఏర్పాట్లు చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. పరీక్షల నిర్వహణలో పారదర్శకత, క్రమశిక్షణ తప్పనిసరిగా పాటించాలని కళాశాల యాజమాన్యాలను ఆదేశించారు.




## ప్రతిభవంతులైన విద్యార్థులను గుర్తించడం కోసమే మిషన్ టెన్త్ క్లాస్

* **యువజన కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ప్రవీణ్ కుమార్..**
* **కన్ సాన్ పల్లిలో శ్రీరామ్ లైఫ్ ఇన్సూరెన్స్ సంస్థ పోస్టర్ ఆవిష్కరణ**

అందోలు,ప్రజాస్ఫూర్తి: ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న ప్రతిభవంతులైన విద్యార్థులను గుర్తించి ప్రోత్సహించడం కోసం శ్రీరామ్ లైఫ్ ఇన్సూరెన్స్ సంస్థ మిషన్ టెన్త్ క్లాస్ అనే కార్యక్రమాన్ని చేపట్టడం అభినందనీయమని యువజన కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ప్రవీణ్ కుమార్ అన్నారు. ప్రభుత్వ పాఠశాలల పదవ తరగతి విద్యార్థులను ప్రోత్సహించే ఉద్దేశంతో శ్రీరామ్ లైఫ్ ఇన్సూరెన్స్ సంస్థ చేపట్టిన 'మిషన్ 10వ తరగతి' ప్రోగ్రాం పోస్టర్‌ను మంగళవారం అందోలు మండల పరిధిలోని కన్ సాన్ పల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో స్థానిక నాయకులు, పాఠశాల ఉపాధ్యాయులతో కలిసి ప్రారంభించారు.. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న ప్రతిభావంతులైన విద్యార్థులను గుర్తించి,వారిని చదువుపై మరింత శ్రద్ధ పెట్టేలా ప్రోత్సహించి మరియు వారి లక్ష్యాలను సాధించే దిశగా మార్గనిర్దేశం చేసే ఒక గొప్ప కార్యక్రమం అన్నారు. ఈ మిషన్ ద్వారా పదవ తరగతిలో స్టేట్ వైడ్ మొత్తం రూ.2.2 కోట్ల క్యాష్ ప్రైజెస్ అందజేయనున్నట్లు వివరించారు. ఇందులో భాగంగా ఫస్ట్ ప్లేస్ సాధించిన స్టూడెంట్‌కు రూ.5 లక్షలు, సెకండ్ ప్లేస్ వారికి రూ.3 లక్షలు, ప్రతి జిల్లా టాపర్‌కు రూ.2 లక్షలు, నియోజకవర్గ టాపర్లకు రూ.1 లక్ష చొప్పున, మండల టాపర్లకు రూ.10 వేల చొప్పున నగదు బహుమతులు లభిస్తాయని తెలిపారు. ప్రభుత్వ పాఠశాల విద్యార్థులను ప్రోత్సహించేందుకు ఇలాంటి కార్యక్రమాన్ని చేపట్టడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపిటిసి బాలయ్య, ఉప సర్పంచ్ పెంటయ్య, యువజన కాంగ్రెస్ గ్రామ పార్టీ అధ్యక్షుడు బాల్ రాజ్, శ్రీరామ్ లైఫ్ ఎన్స్ రెన్స్ సంస్థ జోన్ మేనేజర్ కాడెం రవి, వివోఏ ఆంజనేయులు, కూనపులి సంతు తో పాటు పలువురు పాల్గొన్నారు.

## జోగిపేట మున్సిపల్ బరిలో 63 మంది అభ్యర్థులు...

* **బీజేపీ 14 స్థానాల్లోనే పోటీ..**
* **బీఆర్ఎస్, కాంగ్రెస్‌లు అన్ని స్థానాల్లో పోటీ**




అందోలు, ప్రజాస్ఫూర్తి: జోగిపేట మున్సిపాలిటీలోని 20 వార్డులకుగాను మొత్తం 63 మంది అభ్యర్థులు బరిలో ఉన్నట్లు జోగిపేట మున్సిపల్ కమిషనర్ అవుసలి రవీందర్ ఒక ప్రకటన విడుదల చేశారు. మొత్తం 156 మంది నామినేషన్లు దాఖలు చేయగా మంగళవారం 93 మంది అభ్యర్థులు తమ నామినేషన్లు ఉపసంహరించుకున్నారు. ఇందులో బీజేపీ 14, బీఆర్ఎస్ 20, కాంగ్రెస్ 20 వార్డులకు పోటీ చేస్తున్నారు. 9 మంది వివిధ వార్డుల్లో స్వతంత్ర అభ్యర్థులుగా పోటీ చే స్తున్నారు. ఉదయం నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు నామినేషన్ల ఉప సంహరణ జరిగింది. బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీకి చెందిన అభ్యర్థులు తమ పార్టీ తరపున బీ ఫారములను అధికారులకు అందజేసారు. పోటీల్లో ఉన్న స్వతంత్ర అభ్యర్థులను వివిధ రాజకీయ పార్టీ అభ్యర్థులు తమ నామినేషన్లను ఉప సంహరింపజేయించారు.

* **కాంగ్రెస్‌కు తప్పని రెబల్స్ బెడద**

కాంగ్రెస్ పార్టీకి చెందిన మాజీ కౌన్సిలర్ దుర్గేష్ 14, 1 వార్డులలో భార్య, భర్తలు ఇద్దరు నామినేషన్ వేసిన బి ఫారం లభించలేదు. చివరి 15 నిమిషాల వరకు ఈ రెండు వార్డులకు సంబంధించి ఉత్కంఠ నెలకొంది. 1వ వార్డు నుంచి తన మద్దతుదారుడైన అరుణ్‌కుమార్‌కు పార్టీ బీ ఫాం విషయంలో మాజీ కౌన్సిలర్ శంకర్ పట్టుబట్టడంతో కాంగ్రెస్ నాయకులు పార్టీ తరపున అభ్యర్థిత్వాన్ని ఖరారు చేసారు. మాల, మాదిగ కులాల సమీకరణలో దుర్గేష్ అభ్యర్థిత్వాన్ని కోల్పోవలసి వచ్చిందని తెలుస్తుంది. దుర్గేష్ రెండు వార్డులలోనూ నామినేషన్‌ను ఉపసంహరించుకోకుండా స్వతంత్రంగా బరిలో ఉన్నారు.

## ఘనంగా ప్రారంభమైన 'శ్రీ సాతి భవాని'ల మహాజాతర



ప్రజా స్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: లక్ష్మీదేవిపల్లి మండలం బావోజీ తండా జీపీ పరిధిలోని శేఖరంబంజర గ్రామంలో 'శ్రీ జగదాంబ మేరామా - సంత్ సేవాలాల్ మహరాజ్' దేవస్థానం ప్రాంగణంలో శ్రీ సాతి భవాని అమ్మవార్ల మహాజాతర ఘనంగా ప్రారంభమైంది. ఈ నెల 9 వరకు ఉత్సవాలు కొనసాగనున్నాయి. తొలిరోజు గుగులోత్ భీముడు నాయక్ సౌజన్యంతో అమ్మవార్ల విగ్రహాల ప్రతిష్ఠ నిర్వహించారు. జేఏసీ చైర్మన్ డా. శంకర్ నాయక్, వైస్ చైర్మన్ బానోత్ వీరు నాయక్ పర్యవేక్షణలో సాధు సంత్‌ల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు, భోగ్‌బండారో, హోమాలు, అభిషేకాలు నిర్వహించారు. మత్రాల్, మేరామా, జ్వాల్ప, తుల్జా, ద్వాలంగళ్, హింగ్లా, కేంకాళి భవాని విగ్రహాలను ప్రతిష్ఠించారు. భద్రాద్రి కొత్తగూడెంతో పాటు మహబూబాబాద్, ఖమ్మం, ములుగు జిల్లాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. ఏడుగురు దేవతలను కలిపి సాతి భవానిగా పూజిస్తారని, తుల్జా భవాని శక్తిపీఠంగా ప్రసిద్ధి చెందిందని వీరు నాయక్ తెలిపారు. మహాజాతరను హిందూ సమాజం పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో పూజారి గణేష్ మహారాజ్, తేజావత్ రాములు, సురేష్, రమేష్, బాలు, శంకర్, రాందాస్, రాంపాల్, చంద్రకళ, నీలా, సోమ్లా, సక్రు, ధారావత్ కాన్షిరామ్, గుగులోత్ కేశవ్, బానోత్ మోహన్, బాలకృష్ణ, బాబూలాల్ తదితరులు పాల్గొన్నారు.

## ఎన్ఎస్ కేకే పాఠశాలలో ఘనంగా వార్షికోత్సవం





దుండిగల్,ప్రజాస్ఫూర్తి : దుండిగల్ లోని గాగిలాపూర్ ఎన్ఎస్ కేకే పాఠశాల, కళాశాల 16వ వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు.కార్యక్రమానికి "డెస్టినేషన్ యూనివర్సిటీ" సీనియర్ సర్వీస్ అకాడమీ డైరెక్టర్ కొండా నాగేశ్వర రావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, నేటి పోటీ ప్రపంచంలో విద్యార్థులు కష్టపడి చదువుతో పాటు క్రమశిక్షణ, మానవ విలువలను అలవర్చుకోవాల్సిన అవసరం ఉందని తెలిపారు. విద్యతోనే సమాజంలో మంచి స్థానం సంపాదించవచ్చని ఆయన సూచించారు.విద్యార్థులు తమ లక్ష్యాలను స్పష్టంగా నిర్దేశించుకుని, నిరంతర కృషితో ముందుకు సాగాలని ఆయన పిలుపునిచ్చారు. తల్లిదండ్రులు పిల్లల చదువుపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని, వారిలో ఆత్మవిశ్వాసం పెంచే విధంగా ప్రోత్సహించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. అనంతరం సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.ఈ కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ టి.వి. ఉత్తమ్ నాయక్, సెక్రటరీ కరుణాదేవి బాబు ఉసినిని, కమిటీ సభ్యులు, పాఠశాల వైస్ ప్రిన్సిపల్ సురేష్ చారి, సిబ్బంది, విద్యార్థులు మరియు తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# పోలీస్ జాగిలాలతో గంజాయి హాట్స్పాట్స్ తనిఖీలు



ప్రజా స్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ఆదేశాలతో కొత్తగూడెం డిఎస్పి ఆదినారాయణ సూచనలతో కొత్తగూడెం త్రీ టౌన్ పోలీసుల ఆధ్వర్యంలో మంగళవారం పోలీస్ స్టేషన్ పరిధిలోని గంజాయి హాట్స్పాట్స్ తనిఖీలు నిర్వహించారు. కొత్తగూడెం త్రీ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో గంజాయి హాట్స్పాట్స్ గా గుర్తించబడిన ప్రదేశాలలో ఈ తనిఖీలు చేపట్టడం జరిగిందని త్రీ టౌన్ ఇన్స్పెక్టర్ ఇంద్రసేనారెడ్డి తెలిపారు.ఈ తనిఖీలను నిర్వహించడం కోసం మత్తు పదార్థాలను కనిపెట్టే పోలీస్ జాగిలాలను ఉపయోగించడం జరిగిందని వివరించారు.ఎవరైనా గంజాయి సరఫరా చేస్తున్నట్లుగానీ, అక్రమ రవాణా చేస్తున్నట్లుగానీ,సేవిస్తున్నట్లుగానీ తెలిస్తే వెంటనే పోలీసు వారికి సమాచారం అందించాలని సీఐ కోరారు.

# ప్రజాస్ఫూర్తి క్యాలెండర్‌ను ఆవిష్కరించిన జిల్లా ఎస్పీ రోహిత్ రాజ్



ప్రజాస్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: ప్రజాస్ఫూర్తి 2026 సంవత్సర క్యాలెండర్‌ను భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఎస్పీ రోహిత్ రాజ్ మంగళవారం ఆవిష్కరించారు. జిల్లా ఎస్పీ కార్యాలయంలో జరిగిన ఈ క్యాలెండర్ ఆవిష్కరణ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ప్రజల సమస్యలను ప్రభుత్వ అధికారుల దృష్టికి తీసుకురావడంలో ప్రజాస్ఫూర్తి పత్రిక వారధిగా పనిచేస్తుందన్నారు. ఇదే విధంగా భవిష్యత్తులోనూ ప్రజల సమస్యలపై దృష్టి సారించి పత్రికారంగంలో అగ్రగామిగా ఎదగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ప్రజాస్ఫూర్తి జిల్లా స్టాఫ్ రిపోర్టర్ దశరథ్ రజువా, కొత్తగూడెం రిపోర్టర్ అమిరిశెట్టి మనోజ్ కుమార్ పాల్గొన్నారు.

# కొత్త ఆర్ సి సి పైపులైన్లను పరిశీలించిన కార్పొరేటర్



మల్కాజ్గిరి, ప్రజాస్ఫూర్తి : మల్కాజిగిరి దీనదయాళ్ నగర్ లో రోడ్ నంబర్ 5 వద్ద ఉన్న పాత ఆర్ఆర్ డ్రైన్ శిథిలాలు అవస్థకు చేరడంతో కొత్త ఆర్ సి సి పైపులైన్ వేయించడం జరిగింది. ఈ పనులను ఇంజనీరింగ్ ఏ ఈ నవీన్ సూపర్వైజర్ సాగర్ తో కలిసి కార్పొరేటర్ క్యానం రాజ్యలక్ష్మి పరిశీలించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ డిస్ట్రిక్ట్ కౌన్సిల్ మెంబెర్ ఓం ప్రకాష్ , బిజెపి కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# వైభవంగా శివపార్వతుల కళ్యాణం...

* **శివనామ స్మరణలతో మారుమోగిన అన్నపూర్ణ సహిత కాశీ విశ్వనాథ దేవాలయం..**



అందోలు, ప్రజాస్ఫూర్తి: శ్రీ అన్నపూర్ణ సహిత కాశీ విశ్వనాథ స్వామి దేవాలయం ప్రథమ వార్షికోత్సవాలలో భాగంగా మంగళవారం మెడికుందా గ్రామంలో శివపార్వతుల కళ్యాణం వైభవంగా సాగింది. వార్షికోత్సవాలలో భాగంగా మొదటగా దంపతుల చేతుల మీదుగా వేద పండితులు గణపతి పూజ, హోమాలు జరిపించారు. అనంతరం శివాపార్వతుల కళ్యాణ తంతును నిర్వహించారు. శివపార్వతుల కళ్యాణం మహోత్సవ ఆద్యాంతం భక్తుల శివనామస్మరణలతో ఆలయం ప్రాంగణం మారుమోగింది. శివపార్వతుల కళ్యాణాన్ని ఉద్దేశించి వేద పండితులు ఒక్కొక్క తంతుపై భక్తులకు క్షుణ్ణంగా వివరిస్తూ కళ్యాణం జరిపించడం పట్ల భక్తులు శ్రద్ధగా ఆసక్తిగా తిలకించారు. కళ్యాణ మహోత్సవంలో భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. అనంతరం నిర్వహించారు. ఈ సందర్భంగా పిసిసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పి.సంగమేశ్వర్, ఆత్మ కమిటీ చైర్మన్ కచూర్ రావు లు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ దైవభక్తిని అలవర్చుకోవడంతో మానసిక ప్రశాంతత లభిస్తుందని సూచించారు.భక్తితో ఉంటే మంచి పనులు చేయాలనే ఆలోచనలు వస్తాయని తెలిపారు.నిత్యం భగవంతుడిని స్మరించడంతో ప్రతి ఒక్కరి జీవనం సుఖసంతోషాలతో వర్ధిలుతుందన్నారు. భగవంతుడి ముందు అందరూ సమానమేనని, ప్రతి ఒక్కరూ ధర్మాన్ని కాపాడాలని అన్నారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ నాలచెరు చంద్రకళ, నాయకులు తమ్మనగారి శంకరప్ప , బగిలి వీరప్ప, బక్కప్ప , శివస్వామీ అర్చకులు, ఆయా గ్రామాల సర్పంచులు పాల్గొన్నారు.



# అధికారులు కాదు.. కాంగ్రెస్ పార్టీ ఏజెంట్లు

* **రౌడీయిజంతో.. రాజ్యమేలుతున్నారు**
* **మాజీ ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి**



చౌటుప్పల్, ప్రజాస్ఫూర్తి: ఎన్నికల రిటర్నింగ్ అధికారి, చౌటుప్పల్ మున్సిపల్ కమిషనర్ లు అధికారులుగా కాకుండా కాంగ్రెస్ పార్టీకి ఏజెంట్లుగా పనిచేస్తున్నారని మాజీ ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి ఆరోపించారు. చౌటుప్పల్ మున్సిపల్ కేంద్రం బి ఆర్ ఎస్ పార్టీ కార్యాలయంలో మంగళవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. విత్ డ్రా చివరి రోజు టిఆర్ఎస్ అభ్యర్థులను బలవంతంగా విత్ డ్రా చేయించారని ఆరోపించారు. ప్రజల సంక్షేమం కోసం అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహించడం మరచి రౌడీయిజంతో రాజ్యమేలుతున్నారని ఆరోపించారు. 17వ వార్డు టిఆర్ఎస్ అభ్యర్థి చింతల ఉమామహేశ్వరి సాయిలు ఎన్నికల అధికారికి ఇచ్చిన బిఆర్ఎస్ బి ఫామ్ ను పక్కనపెట్టి, మున్సిపల్ కు సంబంధం లేని వ్యక్తులు కార్యాలయంలో కూర్చొని ఇష్టానుసారంగా వ్యవహరించారని ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిని విత్ డ్రా చేయించి, బీఆర్ఎస్ అభ్యర్థి బీఫామ్ ఇవ్వకుండా ఆపి, కాంగ్రెస్ పార్టీ బీఫామ్ తో ఏకగ్రీవం చేయడం సరైంది కాదన్నారు. ఈ తతంగమంతా జరుగుతున్నా ఎన్నికల రిటర్నింగ్ అధికారి, చౌటుప్పల్ మున్సిపల్ కమిషనర్లు కాంగ్రెస్ పార్టీ ఏజెంట్లుగా పనిచేశారని, ఎన్నికల అధికారి కార్యాలయం కాంగ్రెస్ పార్టీ కార్యాలయంగా మారిందని దుయ్యబట్టారు. ఎన్నికల అధికారి మున్సిపల్ కమిషనర్లను వెంటనే సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. ఆర్ వో కార్యాలయంలో సిసి ఫుటేజ్ తీసుకొని తక్షణమే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఇందుకు సంబంధించి జిల్లా కలెక్టర్ కు ఫిర్యాదు చేస్తామన్నారు. ఈ విధమైన చర్యలకు సరైన మూల్యం చెల్లించుకునే పరిస్థితి త్వరలోనే వస్తుందన్నారు. చౌటుప్పల్ మున్సిపాలిటీలో బీఆర్ఎస్ జెండా ఎగరడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో మున్సిపల్ ఎన్నికల ఇన్చార్జిలు చింతల వెంకటేశ్వర రెడ్డి, తోట్ల స్వామి యాదవ్, మాజీ జెడ్పీటీసీ పెద్దిటి బుచ్చిరెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు గిర్కాటి నిరంజన్ గౌడ్, మున్సిపల్ అధ్యక్షుడు బొమ్మిరెడ్డి వెంకట్ రెడ్డి, నాయకులు చిన్నం బాలరాజు, బోయ సుందర్ తదితరులు పాల్గొన్నారు.

* **అడిషనల్ కలెక్టర్ కు వినతి**

చౌటుప్పల్ మున్సిపల్ ఎన్నికల అధికారి, చౌటుప్పల్ మున్సిపల్ కమిషనర్ లపై చర్యలు తీసుకోవాలని కోరుతూ మునుగోడు మాజీ ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి ఆధ్వర్యంలో యాదాద్రి భువనగిరి జిల్లా అడిషనల్ కలెక్టర్ భాస్కరరావుకు మంగళవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ చౌటుప్పల్ మున్సిపల్ కేంద్రం 17వ వార్డుకు టిఆర్ఎస్ పార్టీ అభ్యర్థిగా చింతల ఉమామహేశ్వరి సాయిలు బి ఫామ్ అందజేశామని పేర్కొన్నారు. చౌటుప్పల్ ఎన్నికల అధికారి, చౌటుప్పల్ మున్సిపల్ అధికారులు సహకారంతో కాంగ్రెస్ నాయకులు తమ అభ్యర్థి బీ ఫామ్ తీసుకోకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించాలని ఆరోపించారు. తమ అభ్యర్థికి కాంగ్రెస్ పార్టీ బీఫామ్ ఇచ్చి ఏకగ్రీవం చేశారని, ఈ ఏకగ్రీవానికి అధికారులు సహకరించాలని ఆరోపించారు. ఈ విషయంపై సీసీ ఫుట్ ద్వారా పూర్తి వివరాలు సేకరించి, దర్యాప్తు చేయాలని, సంబంధిత ఎన్నికల అధికారి మున్సిపల్ కమిషనర్లపై చర్యలు తీసుకోవాలని విన్నవించారు. వినతి పత్రం అందజేసిన వారిలో మున్సిపల్ ఎన్నికల ఇన్చార్జిలు చింతల వెంకటేశ్వర్ రెడ్డి, తోట్ల స్వామి యాదవ్, మాజీ జెడ్పిటిసి పెద్దిటి బుచ్చిరెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు గిర్కాటి నిరంజన్ గౌడ్, మున్సిపల్ అధ్యక్షుడు బొమ్మిరెడ్డి వెంకట్ రెడ్డి, దశరథ తదితరులున్నారు.

# యుఆర్ఎస్ విద్యార్థులకు రాత సామాగ్రి అందజేత



ప్రజా స్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: కొత్తగూడెం మాజీ మండల విద్యాశాఖ అధికారి డాక్టర్ ప్రభుదయాల్ అర్బన్ రెసిడెన్షియల్ పాఠశాలలో అవసరమున్న విద్యార్థులకు రాత సామాగ్రి అందజేశారు. ఈ సందర్భంగా పలకలు, బలపాలు, పెన్నులు, పెన్సిళ్లు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా డాక్టర్ ప్రభుదయాల్ మాట్లాడుతూ విద్యార్థులు రాత సామాగ్రిని సద్వినియోగం చేసుకుని తమ రాత నైపుణ్యాలను అభివృద్ధి పరుచుకోవాలని సూచించారు. చదువు మనిషి జీవితాన్ని మార్చే శక్తివంతమైన సాధనమని, క్రమశిక్షణతో చదువుకుంటే మంచి భవిష్యత్తు సాధ్యమవుతుందని తెలిపారు. చదువు అన్నింటికంటే గొప్ప సంపద అని ఆయన వివరించారు.


# చౌటుప్పల్ మున్సిపాలిటీలో ఖాతా తెరిచిన కాంగ్రెస్

* **17వ వార్డు కౌన్సిలర్ గా చింతల ఉమామహేశ్వరి సాయిలు ఏకగ్రీవం**



చౌటుప్పల్, ప్రజాస్ఫూర్తి: మున్సిపల్ ఎన్నికల్లో చౌటుప్పల్ మున్సిపాలిటీ ఖాతా తెలిసింది. చౌటుప్పల్ మున్సిపల్ కేంద్రం 17వ వార్డు కౌన్సిలర్ గా చింతల ఉమామహేశ్వరి సాయిలు మంగళవారం ఏకగ్రీవయ్యారు. 17వ వార్డు ఎస్సీ మహిళకు రిజర్వేషన్ కాగా, కాంగ్రెస్ పార్టీ బీఫామ్ పస్తం మల్లమ్మ గంగరాములకు కేటాయించారు. కాంగ్రెస్ సీనియర్ నాయకుడు చింతల సాయిలు ఉమామహేశ్వరి బీఆర్ఎస్ కండువా కప్పుకొని, బీఫామ్ తీసుకున్నారు. విత్ డ్రాకు చివరిరోజైనా మంగళవారం కాంగ్రెస్ బీఫామ్ అందుకున్న పస్తం మల్లమ్మ గంగరాములు విత్ డ్రా చేసుకోగా, చింతల ఉమామహేశ్వరి సాయిలుకు కాంగ్రెస్ పార్టీ బీఫామ్ ఇచ్చింది. దీంతో పోటీ లేకపోవడంతో 17వ వార్డు కౌన్సిలర్ గా చింతల ఉమామహేశ్వరి సాయిలు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అనంతరం కాంగ్రెస్ పార్టీ నాయకులు నూతన కౌన్సిలర్ ను పూలమాలలు, శాలువాలతో ఘనంగా సత్కరించారు.

# పవన్ కల్యాణ్‌ని కలిసిన కిషన్‌రెడ్డి, రామచందర్‌రావు



హైదరాబాద్: ఏపీ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌ని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, తెలంగాణ భాజపా అధ్యక్షుడు రామచందర్‌రావు మర్యాదపూర్వకంగా కలిశారు. తెలంగాణలో జరగనున్న మున్సిపల్ ఎన్నికలతో సహా పలు కీలక అంశాలపై చర్చించారు. మున్సిపల్ ఎన్నికల్లో జనసేన తరపున భాజపాకు పవన్ కల్యాణ్ పూర్తి మద్దతు ప్రకటించారు. భాజపా తరపున ఎన్నికల ప్రచారానికి పవన్ కల్యాణ్ అంగీకరించారని రామచందర్‌రావు తెలిపారు.

# వందేళ్ల చరిత్ర... స్మశానవాటిక లేని ఘనత!

* **సింగరేణి పుట్టినిల్లులో 'చచ్చినా చావేనా'..?**
* **ప్రజాస్ఫూర్తిలో ప్రత్యేక కథనం**

ప్రజా స్ఫూర్తి, ఇల్లందు (భద్రాద్రి కొత్తగూడెం జిల్లా):సింగరేణి పుట్టినిల్లు అయిన ఇల్లందు పట్టణం వందేళ్ల చరిత్రను మోస్తున్న ప్రాంతం. బ్రిటిష్ కాలం నుంచే భూగర్భగనుల్లో బొగ్గు తవ్వకాలకోసం దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి వలస వచ్చి ఇక్కడే స్థిరపడిన కుటుంబాలు తరతరాలుగా జీవనం సాగిస్తున్నాయి. కాని పాలకులు ఎందరు మారినా.. అభివృద్ధి మాత్రం ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా తయారైంది. వార్డు మెంబర్ దగ్గరి నుండి ఎమ్మెల్యే, మంత్రుల వరకు ఆ పార్టీ, ఈ పార్టీ అని తేడా లేకుండా ఎవరికి వారు మైకు దొరికితే చాలు మేమెంతో అభివృద్ధి చేశామంటూ ఊకదంపుడు ఉపన్యాసాలు ఇస్తున్నారు మినహా చేసింది మాత్రం శూన్యం అని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వందేళ్ల చరిత్ర ఉన్నప్పటికీ పట్టణ పరిధిలోని కొన్ని ప్రాంతాల్లో ఇప్పటికీ స్మశానవాటికలు లేకపోవడం దారుణమని అంటున్నారు. తమలో ఎవరైనా మృతిచెందితే అంత్యక్రియలు నిర్వహించేందుకు తగిన స్థలం లేక పిచ్చిమొక్కలు, చెత్తకుప్పల మధ్య దహన సంస్కారాలు చేయాల్సి వస్తోందని వాపోతున్నారు.

* **వానొస్తే ఆగిపోతున్న అంత్యక్రియలు**



స్మశానవాటికల్లో కనీస సౌకర్యాలు లేకపోవడంతో వర్షాకాలంలో అంత్యక్రియలు సైతం నిలిచిపోతున్నాయని స్థానిక ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎండాకాలంలో నిలువ నీడ లేక చెట్టుకొకరు, పుట్టకొకరు నిలబడి చివరి వీడ్కోలు చెప్పాల్సి వస్తోందన్నారు. పిచ్చిమొక్కలు విపరీతంగా పెరిగి పాములు, తేళ్లు వంటి విషజీవులు సంచరిస్తుండటంతో భయం భయంగా అంత్యక్రియల్లో పాల్గొనే పరిస్థితి ఉందని వాపోతున్నారు.

* **స్నానాలు, క్షవరాలకు వసతుల కరవు**

అంత్యక్రియల అనంతరం స్నానాలు చేయడానికి, దుస్తులు మార్చుకోవడానికి వసతులు లేక అసౌకర్యానికి గురవుతున్నామని మహిళలు చెప్తున్నారు. ఇక క్షవరాలు చేసుకునేందుకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని తెలిపారు. నీటి సౌకర్యం కరువవడంతో ట్యాంకర్ తెప్పించి స్నానాలు చేయాల్సి వస్తోందని, దీనివల్ల ఆర్థికభారం పడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు.

* **హామీలే తప్ప పరిష్కారం శూన్యం**

ఎన్నికల సమయంలో ఓట్లు అడిగేందుకు వచ్చే ప్రతినాయకుడికీ తమ సమస్యను విన్నవిస్తున్నామని, అయితే గెలిచిన తర్వాత మాత్రం ఎవరూ పట్టించుకోవడం లేదని పాసి కులానికి చెందిన కుటుంబాలు ఆరోపిస్తున్నాయి. గత ప్రభుత్వ హయాంలో 'వైకుంఠధామాలు' పేరుతో స్మశానవాటికల నిర్మాణాలు చేపట్టినా, తమ ప్రాంతాల్లో అవి పూర్తికాలేదని పేర్కొన్నారు. ఇల్లందు మున్సిపాలిటీ పరిధిలోని 11, 12, 13, 14, 15, 16 వార్డులకు, వివిధ బస్తీలు, జగదాంబ సెంటర్, కొత్తకాలనీ, జెకె కాలనీ, వెంగళరావు కాలనీ, లలితాపురం మెయిన్‌రోడ్ తదితర ప్రాంతాల్లో పాసి కుటుంబాలు అధికంగా నివాసం ఉంటున్నాయి. ఈ ప్రాంతాలు సింగరేణి సంస్థ పరిధిలో ఉన్నందున కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ (సి.ఎస్.ఆర్.) నిధుల కింద అయినా ప్రత్యేకంగా స్మశానవాటికలు ఏర్పాటు చేయాలని వారు కోరుతున్నారు.

* **ఈసారి ఓటుతోనే సమాధానం**

వందేళ్లుగా ఈ నేలపై జీవిస్తున్నా వైకుంఠధామం లేని దుస్థితి నుంచి బయటపడాలని ఇల్లందు వాసులు కోరుకుంటున్నారు. ఈసారి మున్సిపల్ ఎన్నికల్లో స్మశానవాటిక నిర్మాణానికి స్పష్టమైన హామీ ఇచ్చిన వారికే ఓటు వేస్తామని, లేకపోతే ఓటుతోనే సమాధానం చెబుతామని పాసి కులస్తులు ముక్తకంఠంతో స్పష్టం చేస్తున్నారు.

## ప్రవేశపెట్టిన20262027 వార్షిక బడ్జెట్ లో విద్యా రంగానికి అన్యాయం

*** ఏఐఎస్ఎఫ్ మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా కార్యదర్శి ఎండీ. అన్వర్..**



హైదరాబాద్, ప్రజాస్ఫూర్తి : కేంద్ర ప్రభుత్వం పార్లమెంట్ యందు ప్రవేశపెట్టిన20262027 వార్షిక బడ్జెట్ లో విద్యా రంగానికి అన్యాయం చేస్తుందని ఏఐఎస్ఎఫ్ మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా కార్యదర్శి ఎండీ. అన్వర్అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 12 ఏళ్ల మోడీపాలనలో విద్యా రంగానికి కేటాయింపులు తగినమొత్తంలో జరగటంలేదన్నారు. ఈ సంవత్సరం 53.5 లక్షల కోట్ల మొత్తం బడ్జెట్లో విద్యకు కేటాయించిన నిధులు కేవలం 1,39,289 కోట్లు. ఇది మొత్తం బడ్జెట్లో 2.6 శాతం మాత్రమే! ఈ నిధులు పెరిగినట్లు కనిపించినప్పటికీ మొత్తం బడ్జెట్ లో శాతంలో పెరుగుదల లేదు. తెలంగాణ విభజన హామీ చట్టంలో ఉన్న విద్యాసంస్థలను కేటాయించకుండా, రాష్ట్రానికి ప్రత్యేక నిధులు కేటాయించకుండా అడుగడుగునా మొండి వైఖరిని ప్రదర్శిస్తుంది. 8 మంది బీజేపీ ఎంపీలు ఉన్న కూడా తెలంగాణకి రావలసిన నిధులు, హక్కుల గురుంచి నోరుమెదపలేని పరిస్థితి నెలకొన్నది. రాజకీయ ప్రసంగాలు చేయడంలో ముందు వరుసలో ఉండే బీజేపీ ఎంపీలు రాష్ట్రానికి అన్యాయం జరుగుతున్నా చేతులు కట్టుకొని ఉంటూ.. తెలంగాణలో ఉన్న విద్యార్థులను, ప్రజలను మోసం చేస్తున్నారు.గత సంవత్సరం బడ్జెట్ 48,21,000,ల కోట్లు కాగా విద్యకు కేటాయించింది 1,28,628 కోట్లు, మొత్తం బడ్జెట్ లో 2.6 శాతం మాత్రమే. బడ్జెట్ కేటాయింపులు లేకుండా బడ్జెట్ ప్రసంగాలు ఎన్ని చేసినా క్షేత్రస్థాయిలో పేద, మధ్యతరగతి ప్రజలకు విద్య అందని ద్రాక్షగా మిగులుతుందన్నారు.

## వికారాబాద్ లో కాంగ్రెస్, బీఆర్ఎస్ బోణి

వికారాబాద్, ప్రజాస్ఫూర్తి : మున్సిపల్ ఎన్నికల్లో భాగంగా వికారాబాద్ లో కాంగ్రెస్, బీఆర్ఎస్ బోణి కోట్టాయి. 1వ వార్డు నుంచి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి అనంత రెడ్డి ,15వ వార్డు బీఆర్ఎస్ అభ్యర్థి విజయ లక్ష్మీ విజయ్కుమార్ లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అధికార బలంతో కాంగ్రెస్ నాయకులు తమ అభ్యర్థులను బలవంతంగా విత్ డ్రా చేయిస్తున్నారని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు మెతుకు ఆనంద్ ఆరోపించారు. దీంతో వికారాబాద్ రాజకీయాల్లో ఒక్కసారి గా వేడి పెరిగింది.

## ఎంఐఎం మాజీ ఎమ్మెల్యే పాషా ఖాద్రీ కన్నుమూత



హైదరాబాద్: ఎంఐఎం పార్టీ ప్రధాన కార్యదర్శి, మాజీ ఎమ్మెల్యే అహ్మద్ పాషా ఖాద్రీ (72) కన్నుమూశారు. కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన మంగళవారం సాయంత్రం తుదిశ్వాస విడిచారు. పాషా ఖాద్రీ 1986 నుంచి 1991 వరకు కార్పొరేటర్గా పనిచేశారు. 2004 నుంచి 2018 వరకు చార్మినార్ నియోజకవర్గ ఎమ్మెల్యేగా, 2018 నుంచి 2023 వరకు యాకుత్పురా నియోజకవర్గం ఎమ్మెల్యేగా బాధ్యతలు నిర్వహించారు.

## జగిత్యాలలో రోడ్డు ప్రమాదం.. నలుగురి మృతి



జగిత్యాల: ట్రాక్టర్ అదుపుతప్పి బోల్తా పడిన ప్రమాదంలో నలుగురు వ్యవసాయ కూలీలు మృతి చెందిన ఘటన జగిత్యాల జిల్లాలో మంగళవారం రాత్రి జరిగింది. వ్యవసాయ కూలీలు పసుపుకోతకు వెళ్లి తిరిగి వస్తుండగా.. మల్లాపూర్ మండలం ముగిలిపేట వద్దకు రాగానే ట్రాక్టర్ అదుపుతప్పి నీటి గుంతలో బోల్తా పడింది. ఈ ప్రమాదంలో నలుగురు కూలీలు మృతి చెందగా, పలువురికి గాయాలయ్యాయి. క్షతగాత్రులను సమీపంలోని ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. పోలీసులు ఘటనా స్థలికి చేరుకొని సహాయక చర్యలు చేపట్టారు.

## తెలంగాణలో గవర్నర్ కోటా ఎమ్మెల్సీల ఎంపికపై సుప్రీంకోర్టు స్పష్టత



దిల్లీ: తెలంగాణలో గవర్నర్ కోటా ఎమ్మెల్సీల ఎంపిక విషయంలో సుప్రీంకోర్టు స్పష్టత ఇచ్చింది. ఎమ్మెల్సీల ఎంపికకు అడ్డంకిగా తమ ఉత్తర్వులు లేవని తేల్చి చెప్పింది. గతేడాది ఆగస్టు 13 నాటి మధ్యంతర ఉత్తర్వుల్లోనే స్పష్టంగా చెప్పామని జస్టిస్ విక్రంనాథ్ ధర్మాసనం తెలిపింది. కేబినెట్ నిర్ణయానికి అనుగుణంగా గవర్నర్ నిర్ణయం తీసుకోవచ్చని స్పష్టం చేసింది. తమ ఎన్నికపై జారీ చేసిన ఉత్తర్వులు ఎత్తివేయాలని అమిర్ అలీ సుప్రీంకోర్టులో వెకేట్ పిటిషన్ వేశారు. అమిర్ అలీ పిటిషన్ను దాసోజు శ్రవణ్ వేసిన ప్రధాన పిటిషన్తో జతచేస్తూ ఈమేరకు ఆదేశాలు జారీ చేసింది. తదుపరి విచారణ ధర్మాసనం మార్చి 19కి వాయిదావేసింది.

## భక్తి శ్రద్ధలతో ద్వాదశి జ్యోతిర్లింగ శివ పూజ మహోత్సవం





కుత్బుల్లాపూర్, ప్రజాస్ఫూర్తి : నల్ల గుట్టలోని శ్రీ భ్రమరాంబ మల్లికార్జున స్వామి దేవస్థానం (చిన్న శ్రీశైలం)లో దూడిమెట్ల సోమేష్ యాదవ్ గురు స్వామి వారి ఆధ్వర్యంలో ద్వాదశి జ్యోతి ర్లింగ శివ పూజ మహోత్సవం భక్తి శ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఈ కార్య క్రమానికి జిహెచ్ఎంసి డివిజన్ అధ్యక్షులు పుప్పాల భాస్కర్, రుద్ర అశోక్ ,పోలే శ్రీకాంత్ లు హాజరై ప్రత్యేక పూజలు నిర్వ హించారు. అనంతరం ఏర్పాటు చేసిన అన్నప్రసాద కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా భక్తులకు అన్నప్రసాదం వితరణ చేయగా, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారి ఆశీస్సులు పొందారు. ఆలయ ప్రాంగణం భక్తులతో కిటకిటలాడుతూ ఆధ్యాత్మిక వాతావరణంతో మార్మోగింది. ఈ సందర్భంగా దూడిమెట్ల సోమేష్ యాదవ్ గురు స్వామి మాట్లాడుతూ భక్తులందరికీ ఆధ్యాత్మిక శాంతి, ఆరోగ్యం, ఐశ్వర్యం కలగాలని స్వామి వారిని ప్రార్థిస్తున్నామన్నారు. ద్వాదశి జ్యోతిర్లింగ శివ పూజ మహోత్సవం నిర్వహించడం ఎంతో పుణ్యప్రదమైన కార్యం. ఇటువంటి కార్యక్రమాల ద్వారా ధర్మం నిలబడుతుందన్నారు. సమాజంలో ఐక్యత పెరుగుతుంది. భక్తుల సహకారంతో ప్రతి సంవత్సరం ఇలాంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలు మరింత ఘనంగా నిర్వహించడానికి కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు గురుస్వాములు వెంకట్ రెడ్డి, కృష్ణారెడ్డి, సురేష్ రెడ్డి, యాదిలాల్ ,రాజు, చంద్రమోహన్ రెడ్డి , స్థానిక నాయకులు, శివభక్తులు, మహిళలు, యువకులు తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## సింగిల్ కార్పొరేషన్ కి బడ్జెట్ పెట్టడం ఎంతవరకు సమంజసం : కార్పొరేటర్ శ్రవణ్



మల్కాజిగిరి . ప్రజాస్ఫూర్తి : జిహెచ్ఎంసి మూడు కార్పొరేషన్ల గా విభజిస్తారని పూర్తిగా వార్తలొస్తున్న నేపథ్యంలో ఉద్యోగులను కూడా అదే స్థాయిలో కేటాయింపులు జరుగుతున్నటువంటి నేపథ్యంలో సింగిల్ కార్పొరేషన్ కి బడ్జెట్ పెట్టడం ఎంతవరకు సమంజసమని కార్పొరేటర్ శ్రవణ్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బడ్జెట్ పుస్తకంలో అనేక అవాస్తవాలు పొందుపరిచారు 20సంవత్సరాలుగా ఆస్తిపన్ను నగరంలో పెంచలేదంటూ రాయడం పూర్తిగా అవాస్తవమన్నారు. 100 రూపాయల టాక్స్ కు 10000 రూపాయలు వసూలు చేస్తున్నటువంటి పరిస్థితులు ఈరోజు నగరంలో ఉన్నాయి జిహెచ్ఎంసి సేవలు కూడా ఆ స్థాయిలోనే ఉండాలని కోరుతున్నామన్నారు. ఒకవేళ మూడు కార్పొరేషన్ల విభజిస్తే ఈ బడ్జెట్ను ఏ విధంగా మూడు కార్పొరేషన్లకు పంచుతారు? * బడ్జెట్ పుస్తకంలో జిహెచ్ఎంసి ఆస్తులకు అప్పులకు సంబంధించినటువంటి ఆర్థిక వివరాలు పూర్తిస్థాయిలో పొందుపరచలేదన్నారు. జిహెచ్ఎంసి లో తొందర్లోనే 200 పైగా ఉద్యోగులు రిటైర్ ఐతున్నటువంటి నేపథ్యంలో జిహెచ్ఎంసి స్థాయి కూడా పెరుగుతున్నటువంటి పరిస్థితులలో 10 సంవత్సరాలు పైగా పనిచేస్తున్నటువంటి ఔట్సోర్సింగ్ సిబ్బందిని పూర్తిస్థాయిగా పర్మెంటుగా నియమించుకోవడం జరగాలన్నారు. 10 ఫ్లోర్లు పైగా కడుతున్నటువంటి బడా బిల్డర్ లందరినీ సంబంధించి బిల్డింగ్ పర్మిషన్ ఫీజులను, ఇంపాక్ట్ ఫీజులను హెచ్ఎండిఏ ద్వారా మాత్రమే చేయాలన్నటువంటి ప్రభుత్వ ప్రతిపాదనని విరమించుకోవాలన్నారు. జిహెచ్ఎంసి నడ్డి విరిచి జిహెచ్ఎంసి ఆదాయాన్ని గద్దల తన్నుకుపోయి ప్రయత్నాన్ని మానాలన్నారు. బడ్జెట్ పుస్తకంలో అనేక పేజీలను పాత బుక్ లోంచి చింపి కొత్త పుస్తకంలో పెట్టినట్టుగా ఉందన్నారు. హెచ్ సిటీ పేరుతో ప్రభుత్వం చేస్తున్న పనులకు ఇవ్వాల్సిన గ్రాండ్లు ఇప్పటివరకు జిహెచ్ఎంసికి అందకపోవడం శోచనీయమన్నారు. గత కౌన్సిల్ సమావేశంలో తీర్మానం చేసిన విధంగా రెండు కోట్ల పూర్తి నిధులను కార్పొరేటర్లకు వెంటనే కేటాయించాలన్నారు.



## బీఆర్ఎస్ అభ్యర్థులతో.. శవరాజకీయాలు

**: దమ్ముంటే ప్రజాస్వామ్యబద్ధంగా పోటీ చేసి గెలవండి**

*** పబ్బు రాజు గౌడ్**


చౌటుప్పల్, ప్రజాస్ఫూర్తి: భూములు.. ఆస్తుల పేపర్లు తీసుకొస్తే డబ్బులు ఇస్తానంటూ.. బీఆర్ఎస్ కౌన్సిలర్ అభ్యర్థులతో పీనుగలపై పేలాలు ఏరుకుంటూ శవ రాజకీయాలకు పాల్పడుతున్నాడని కాంగ్రెస్ పార్టీ మునుగోడు నియోజకవర్గం ఎన్నికల ఇంచార్జ్ పబ్బు రాజు గౌడ్ ఆరోపించారు. చౌటుప్పల్ మున్సిపల్ పరిధి లక్కారంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇటీవల గ్రామపంచాయతీ ఎన్నికల్లో 7, 8సీట్లు వస్తే బీఆర్ఎస్ పార్టీ ఏదో సాధించిందని మాజీ ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి భావిస్తున్నారని ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీ రౌడీయిజం పాల్పడుతుందని, దౌర్జన్యాలు చేస్తున్నారని అసత్య ప్రచారాలు చేయడం పట్ల మండిపడ్డారు. తాము అధికారంలో ఉన్నా, లేకపోయినా ప్రజాస్వామ్య బద్ధంగా వ్యవహరిస్తామని స్పష్టం చేశారు. ప్రజలు కాంగ్రెస్ పార్టీని కోరుకుంటున్నారని, 17 వ వార్డు అభ్యర్థి బీఆర్ఎస్ పార్టీలో ఇమడలేక తిరిగి కాంగ్రెస్ పార్టీలో చేరారని, తాము ఎవర్ని ప్రలోభాలకు గాని భయభ్రాంతులకు గురి చేయలేదన్నారు.

*** క్షణికావేశంలో తీసుకున్న నిర్ణయం**

*** 17వ వార్డు కౌన్సిలర్ చింతల ఉమామహేశ్వరి సాయిలు**

బీఆర్ఎస్ పార్టీలోకి వెళ్లడం.. క్షణికావేశంలో తీసుకున్న నిర్ణయమని 17వ వార్డు కౌన్సిలర్ చింతల ఉమామహేశ్వరి సాయిలు స్పష్టం చేశారు. మున్సిపల్ ఎన్నికల నోటిఫికేషన్ అనంతరం జరిగిన పరిణామాల వల్ల కాంగ్రెస్ పార్టీ బీఫామ్ ఇవ్వకపోవడంతో నొచ్చుకున్నానన్నారు. అదే సమయంలో క్షణికావేశంలో తీసుకున్న తప్పుడు నిర్ణయం బిఆర్ఎస్ పార్టీలోకి వెళ్లడమని స్పష్టం చేశారు. 2009నుంచి కాంగ్రెస్ పార్టీలో కీలకంగా పనిచేస్తున్నానన్నారు. మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డికి అత్యంత సన్నిహితునిగా మెలిగానని గుర్తు చేశారు. రాజగోపాల్ రెడ్డి తనకు దేవునితో సమానమన్నారు. అయిష్టంగానే బిఆర్ఎస్ పార్టీలోకి వెళ్లానని, ఆ పార్టీలో రెండు రోజులు కూడా ఇమడలేకపోయానన్నారు. అందుకే ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డికి ఫోన్ చేశానని, 16సంవత్సరాలుగా సన్నిహితునిగా మెలిగిన నీకు సముచిత న్యాయం చేస్తానని బీఫామ్ ఇచ్చారన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వమే ఉందని, కాంగ్రెస్ ఎమ్మెల్యే కావడంతో, వార్డు నుంచి బరిలోకి దిగిన అభ్యర్థులు అభివృద్ధిని దృష్టిలో ఉంచుకొని విత్ డ్రా చేసుకున్నారన్నారు. ఇందులో ఎవరి ప్రోద్బలం లేదని స్పష్టం చేశారు. తన ఏకగ్రీవ ఎన్నికలకు సహకరించిన ప్రతి ఒక్కరికి ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. ఈ సమావేశంలో మాజీ జెడ్పిటిసి చిలుకూరి ప్రభాకర్ రెడ్డి, చౌటుప్పల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ఆకుల ఇంద్రసేనారెడ్డి, కాంగ్రెస్ మాజీ మండల అధ్యక్షుడు బక్క శ్రీనాథ్, మాజీ కౌన్సిలర్ కామిశెట్టి శైలజ భాస్కర్, నాయకులు గుండు మల్లయ్య, అర్థ వెంకట్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఐబొమ్మ రవి బెయిల్ పిటిషన్పై హైకోర్టులో విచారణ వాయిదా



హైదరాబాద్: బెయిల్ మంజూరు చేయాలని కోరుతూ ఐబొమ్మ రవి హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. పిటిషన్పై విచారణను ఉన్నత న్యాయస్థానం శుక్రవారానికి వాయిదా వేసింది. ఐ బొమ్మ రవిపై సీసీఎస్ పోలీసులు 4 కేసులు నమోదు చేశారు. ప్రస్తుతం చంచల్ గూడ జైలులో రిమాండ్ ఖైదీగా ఉన్నారు. బెయిల్ మంజూరు చేయాల్సిందిగా నాంపల్లి కోర్టులో రవి పిటిషన్ దాఖలు చేసినప్పటికీ.. న్యాయస్థానం అంగీకరించలేదు. దీంతో నాలుగు కేసుల్లోనూ తనకు బెయిల్ మంజూరు చేయాలంటూ గత నెల 21న హైకోర్టులో వేర్వేరుగా పిటిషన్లు దాఖలు చేశారు. ఈ కేసులో సీనియర్ న్యాయవాది వాదనలు వినిపిస్తారని.. సమయం కావాలని రవి తరఫు న్యాయవాది కోరడంతో హైకోర్టు ఈ మేరకు శుక్రవారానికి వాయిదా వేసింది.

## అన్ని పట్టణాలపై గులాబీ జెండా ఎగురవేయాలి: కేటీఆర్



హైదరాబాద్: మున్సిపల్ ఎన్నికల్లో భారత రాష్ట్ర సమితి ఘన విజయం సాధించి, అన్ని పట్టణాలపై గులాబీ జెండా ఎగురవేయాలని ఆ పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ పిలుపునిచ్చారు. పార్టీ నియోజకవర్గ ఇన్ఛార్జిలు, మున్సిపల్ ఎన్నికల సమన్వయకర్తలు, జిల్లా అధ్యక్షులతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించి నేతలకు దిశానిర్దేశం చేశారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన రెండేళ్లలోనే ప్రజల్లో ఆ పార్టీ పట్ల తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోందని, హామీల అమలులో విఫలమై మోసం చేసిన తీరును ప్రజలు గమనిస్తున్నారని అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా బీఆర్ఎస్ పార్టీకి అనుకూల వాతావరణం ఉందని, పురపాలక ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి ప్రజలు కచ్చితంగా బుద్ధి చెబుతారన్న ఆశాభావం వ్యక్తం చేశారు. వచ్చే వారం రోజుల పాటు పార్టీ శ్రేణులంతా సమన్వయంతో కష్టపడితే భారీ మెజారిటీతో విజయం సాధించడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. గత మున్సిపల్ ఎన్నికల్లో బీఆర్ఎస్ ప్రభంజనం ముందు ప్రతిపక్షాలు నిలవలేకపోయాయని, అప్పట్లో కాంగ్రెస్, బీజేపీలు కేవలం ఏడెనిమిది స్థానాలకే పరిమితమయ్యాయని కేటీఆర్ గుర్తు చేశారు. ఎన్నికల వ్యూహంలో భాగంగా సమన్వయం కీలకమని, పార్టీ విజ్ఞప్తిని మన్నించి నామినేషన్లు ఉపసంహరించుకున్న రెబల్ అభ్యర్థులను సాదరంగా ఆహ్వానించాలని కోరారు. పార్టీ క్రమశిక్షణకు కట్టుబడి త్యాగం చేసిన ప్రతి నాయకుడి ఇంటికి అభ్యర్థులు స్వయంగా వెళ్లి, వారిని ప్రచారంలో భాగస్వాముల్ని చేయాలని ఆదేశించారు. వారికి తగిన గౌరవం ఇచ్చి కలిసికట్టుగా ముందుకు సాగాల్సిన బాధ్యత మున్సిపల్ సమన్వయకర్తలపై ఉందని స్పష్టం చేశారు. నామినేషన్ల ప్రక్రియ ముగిసిన నేపథ్యంలో, క్షేత్రస్థాయి పరిస్థితులపై సమగ్ర నివేదికను వెంటనే పార్టీ కేంద్ర కార్యాలయానికి పంపాలని కేటీఆర్ సూచించారు. చివరి ఘట్టమైన ప్రచారంపై దృష్టి సారించి ప్రతి నిమిషాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. పార్టీ జిల్లా అధ్యక్షులు, మాజీ మంత్రులు తమ పరిధిలోని మున్సిపాలిటీల్లో విజయావకాశాలను అంచనా వేసి, గెలుపు గుర్రాలను గట్టెక్కించేందుకు అవసరమైన కార్యాచరణ సిద్ధం చేయాలని తెలిపారు. అభ్యర్థుల గెలుపుతో పాటు పోలింగ్ రోజున ఓటింగ్ శాతం పెంచడంపై కూడా నాయకులు ప్రత్యేకంగా దృష్టి సారించాలని సూచించారు. ఎన్నికల ప్రక్రియ ముగిసే వరకు సమన్వయకర్తలు తమకు కేటాయించిన మున్సిపాల్టీల్లోనే అందుబాటులో ఉండాలని కేటీఆర్ ఆదేశించారు.

## బెదిరించి ఉపసంహరింపజేశారు!

*** రామగుండంలో పోలీసులపై అదనపు డీసీపీకి భాజపా అభ్యర్థి ఫిర్యాదు**



గోదావరిఖని, గోదావరిఖని పట్టణం: రామగుండం నగరపాలక ఒకటో డివిజన్లో భాజపా తరపున నామినేషన్ దాఖలు చేసిన రీమాబిశ్వాస్ సోమవారం ఉపసంహరించుకున్నారు. జనరల్ మహిళకు కేటాయించిన ఈ డివిజన్లో ముగ్గురు నామినేషన్లు దాఖలు చేశారు. ఎన్టీపీసీ పోలీసులు, కొంత మంది నాయకులు బలవంతంగా ఉపసంహరించుకోవాలని తనను బెదిరించారని రీమా బిశ్వాస్... భాజపా నాయకులు కాసం వెంకటేశ్వర్లు, సంధ్యారాణి తదితరులతో కలిసి రామగుండం పోలీసు కమిషనరేట్ అదనపు డీసీపీ శ్రీనివాస్కు ఫిర్యాదు చేశారు. బాధితురాలి కథనం ప్రకారం.. రీమాబిశ్వాస్ భర్త పంకజ్కుమార్ బిశ్వాస్ ఎన్టీపీసీలో కాంట్రాక్టు కార్మికుడు. మధ్యాహ్నం ఆయన విధుల్లో ఉండగా పోలీసులు పంకజ్ను ఠాణాకు పిలిపించారు. 'నీ మీద గంజాయి కేసు పెడతాం.. జైలుకు వెళ్తావా.. నామినేషన్ ఉపసంహరించుకుంటారా' అని బెదిరించారు. ఒకటో డివిజన్ కాంగ్రెస్ పార్టీ నాయకుడు మల్లేశ్ అనుచరులు కూడా కొద్ది రోజుల నుంచి బెదిరిస్తున్నారు. బలవంతంగా నా కుమారుడితో సహా నన్ను ఎన్టీపీసీలోని నామినేషన్ కేంద్రానికి తీసుకెళ్లి ఉపసంహరణ పత్రాలపై సంతకాలు పెట్టించారు అని ఫిర్యాదులో పేర్కొన్నారు. భాజపా నగరపాలిక ఎన్నికల ఇన్ఛార్జి కాసం వెంకటేశ్వర్లు విలేకరులతో మాట్లాడుతూ హైదరాబాద్లో తమ పార్టీ నాయకులు ఎన్నికల సంఘంతోపాటు డీజీపీకి ఫిర్యాదు చేశారన్నారు.

**ఈ డివిజన్ ఏకగ్రీవమే!**

ఇక్కడ భారాస నుంచి ఇజ్జగిరి శ్వేత, భాజపా నుంచి రీమాబిశ్వాస్, కాంగ్రెస్ నుంచి మడిపెల్లి విజయ నామినేషన్లు వేశారు. వీరిలో భారాస, భాజపా అభ్యర్థినులు ఉపసంహరించుకోవడంతో కాంగ్రెస్ అభ్యర్థి విజయ ఒక్కరే బరిలో మిగిలారు.

# యార్ ఏంటి..? ఇవేం మాటలు..?: ప్యానెల్ స్పీకర్ ఆగ్రహం

బడ్జెట్ సమావేశాల్లో మంగళవారం లోక్‌సభ కార్యకలాపాలకు తీవ్ర అంతరాయం కలిగింది. కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ ప్రసంగిస్తున్న సమయంలో అధికార కూటమి సభ్యులు అభ్యంతరం వ్యక్తంచేశారు. దీంతో విపక్ష ఎంపీ ఒకరు ప్యానెల్ స్పీకర్‌ను ఉద్దేశించి 'yaar' అని సంబోధించారు. ఇలా మాట్లాడటాన్ని ప్యానెల్ స్పీకర్ వ్యతిరేకించారు. "ఇప్పుడు మీరు ఏం అన్నారు? ఈ యార్ ఏంటి? ఇది పార్లమెంట్. మీరు సభాపతి స్థానంలో ఉన్న వ్యక్తిని ఉద్దేశించి అలా మాట్లాడకూడదు. ఇది సభా మర్యాదకు వ్యతిరేకం. వెంటనే మీ మాటలు వెనక్కి తీసుకోండి" అని ప్యానెల్ స్పీకర్‌గా ఉన్న తెన్నేటి కృష్ణ ప్రసాద్ మందలించారు. ఆయన లోక్‌సభలో ప్యానెల్ ఆఫ్ ఛైర్‌పర్సన్స్‌లో ఒకరు. చైనా దురాక్రమణపై భారత సైన్యం మాజీ



అధిపతి ఎం.ఎం.నరవణె రాసిన ఆత్మకథలోని అంశాలను విపక్షనేత రాహుల్‌గాంధీ మంగళవారం కూడా ప్రస్తావించారు. రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై చర్చలో భాగంగా జాతీయ భద్రతా అంశాలపై మాట్లాడాలనుకుంటున్నానని చెప్పారు. ఈ క్రమంలోనే విపక్ష సభ్యులు స్పీకర్ కుర్చీ దిశగా కాగితాలు చించి విసిరారు. వారిపై స్పీకర్ చర్యలు తీసుకున్నారు. ఈ సెషన్ మొత్తానికి ఎనిమిది మంది సభ్యులపై సస్పెన్షన్ వేటు వేశారు. హిబీ ఈడెన్, అమరీందర్ సింగ్ రాజా వారింగ్, మాణికం ఠాగూర్, గుర్జీత్ సింగ్, కిరణ్‌కుమార్‌రెడ్డి, ప్రశాంత్ పడొలె, డీన్ కురియకోస్, సీపీఐ(ఎం)ఎంపీ ఎస్ వెంకటేశన్‌లను సస్పెండ్‌చేశారు. అనంతరం సభ రేపటికి వాయిదా పడింది.

## మణిపుర్ నూతన సీఎంగా
## యుమ్నం ఖేమ్‌చంద్ సింగ్..!

మణిపుర్‌లో రాష్ట్రపతి పాలనకు ఏడాది పూర్తికానున్న నేపథ్యంలో కీలక పరిణామం చోటుచేసుకుంది. కొత్త సీఎంగా భాజపా నేత యుమ్నం ఖేమ్‌చంద్ సింగ్ ప్రమాణ స్వీకారం చేయనున్నట్లు సమాచారం. మంగళవారం ఆయన భాజపా శాసనసభాపక్ష నేతగా ఎన్నికయ్యారు. అలాగే, మహిళా నేత నెమ్చా కిప్‌జెన్ ఉప ముఖ్యమంత్రి అయ్యే అవకాశం ఉన్నట్లు సమాచారం. మణిపుర్ ప్రస్తుత శాసనసభ పదవీకాలం 2027 వరకు ఉంది. 2023 మే నుంచి జాతుల మధ్య ఘర్షణలతో



మణిపుర్ అట్టుడికింది. 250 మందికిపైగా మృతి చెందగా.. వేలాదిమంది నిరాశ్రయులయ్యారు. ఈ క్రమంలోనే గతేడాది ఫిబ్రవరిలో సీఎం బీరెన్ సింగ్ రాజీనామా చేయడంతో అక్కడ రాష్ట్రపతి పాలన విధించిన విషయం తెలిసిందే. బీరెన్ సింగ్ రాజీనామాతో ఏడాది కాలంగా సీఎం పోస్టు ఖాళీగా ఉండటంతో... తాజా పరిణామాల నేపథ్యంలో కొత్త సీఎంగా ఖేమ్‌చంద్ బాధ్యతలు చేపట్టేందుకు రంగం సిద్ధమవుతోంది. మణిపుర్ అసెంబ్లీలో మొత్తం 60 స్థానాలు ఉన్నాయి. ప్రస్తుతం 37 మంది భాజపా ఎమ్మెల్యేలు ఉన్నారు. నేషనల్ పీపుల్స్ పార్టీ నుంచి ఆరుగురు, కాంగ్రెస్, నాగా పీపుల్స్ ఫ్రంట్‌ల నుంచి ఐదుగురు చొప్పున, కుకీ పీపుల్స్ అలయన్స్ నుంచి ఇద్దరు, జేడీయూ నుంచి ఒకరు, ముగ్గురు స్వతంత్రులు ఎమ్మెల్యేలుగా ఉన్నారు. ఒక స్థానం ఖాళీగా ఉంది.

## అజిత్ పవార్ అంత్యక్రియల్లో చేతివాటం.. ఏడుగురి అరెస్ట్

విమాన ప్రమాదంలో కన్నుమూసిన మహారాష్ట్ర ఉప ముఖ్యమంత్రి అజిత్ పవార్ అంత్యక్రియలు గురువారం బారామతిలోని విద్యా ప్రతిష్ఠాన్ మైదానంలో జరిగిన విషయం తెలిసిందే. అయితే ఇదే అదునుగా పలువురి నగలను, నగదును కొందరు దొంగలు కాజేశారు. వీరిని పోలీసులు మంగళవారం అరెస్టుచేశారు. అజిత్ పవార్ అంత్యక్రియలకు



భారీ సంఖ్యలో పార్టీ కార్యకర్తలు, అభిమానులు తరలివచ్చారు. ఆయన అంతిమ సంస్కారాలు ముగిసిన అనంతరం దాదాపు 15మంది వ్యక్తులు తమ బంగారు గొలుసులు చోరీకి గురైనట్లు గుర్తించారు. వెంటనే స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. వాటి విలువ సుమారు రూ.30లక్షలు ఉంటుందని అంచనా వేశారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు నిందితుల కోసం గాలింపు చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగా మంగళవారం ఏడుగురు అనుమానితులను అరెస్ట్ చేసినట్లు తెలిపారు.



## భారత్‌లో మళ్లీ 'రయ్ రయ్' మోత..
## 12 ఏళ్ల తర్వాత ఫార్ములా-1 రీఎంట్రీ!

దేశంలోని రేసింగ్ ప్రియులకు కేంద్రం గుడ్‌న్యూస్ చెప్పనుంది. దాదాపు 12 ఏళ్ల విరామం తర్వాత, ప్రపంచ ప్రసిద్ధ 'ఫార్ములా 1' (F1) గ్రాండ్‌ప్రి రేసులను మళ్లీ భారత్‌కు తీసుకువచ్చేందుకు కేంద్ర ప్రభుత్వం వేగంగా అడుగులు వేస్తోంది. 2013లో చివరిసారిగా గ్రేటర్ నోయిడాలోని 'బుద్ధ ఇంటర్నేషనల్ సర్క్యూట్'లో జరిగిన ఈ మెగా ఈవెంట్‌ను పునరుద్ధరించేందుకు కేంద్ర క్రీడాశాఖ తీవ్రంగా కసరత్తు చేస్తోంది. ఈ నేపథ్యంలోనే కేంద్ర క్రీడాశాఖ మంత్రి మన్సుఖ్ మాండవీయ తాజాగా గ్రేటర్ నోయిడాలోని బుద్ధ సర్క్యూట్‌ను స్వయంగా సందర్శించారు. ప్రస్తుతం ఈ ట్రాక్ నియంత్రణలో ఉన్న యమునా ఎక్స్‌ప్రెస్‌వే ఇండస్ట్రియల్ డెవలప్‌మెంట్ అథారిటీ (YEIDA) అధికారులతో ఆయన సుదీర్ఘంగా చర్చించారు. ఈ రేసులను వీలైనంత త్వరగా పునఃప్రారంభించాలని, ఇందుకోసం ట్రాక్ నిర్వహణ బాధ్యతలను 23 ఏళ్ల పాటు ఏదైనా ప్రముఖ స్పోర్ట్స్ మేనేజ్‌మెంట్ కంపెనీకి అప్పగించాలని ఆయన సూచించినట్లు సమాచారం.

*** అడ్డంకులు తొలగేనా?**

2011లో అట్టహాసంగా మొదలైన ఫార్ములా 1 భారత్ ప్రయాణం.. పన్ను వివాదాలు, తదితర అడ్డంకుల వల్ల 2013లోనే అర్ధాంతరంగా నిలిచిపోయింది. గతంలో దీనిని కేవలం ఒక వినోద కార్యక్రమంగా పరిగణించడం వల్ల భారీగా పన్నులు పడ్డాయి. అయితే, ప్రస్తుతం ఉన్న పన్ను సమస్యలను త్వరలోనే పరిష్కరిస్తామని, కేంద్ర ప్రభుత్వం ఈ విషయంలో సానుకూలంగా ఉందని అధికార వర్గాలు వెల్లడించాయి. దీవాలా తీసిన జేపీ గ్రూప్ నుంచి బుద్ధ సర్క్యూట్‌ను కొనుగోలు చేసేందుకు అదానీ గ్రూప్ ఆసక్తి చూపుతోంది. ఈ ఒప్పందం గనుక ఓ కొలిక్కి వస్తే, ఫార్ములా 1 పునరాగమనం మరింత వేగవంతం అయ్యే అవకాశం ఉంది. ప్రపంచవ్యాప్తంగా ప్రస్తుతం 24 రేసులతో F1 క్యాలెండర్ బిజీగా ఉన్నప్పటికీ, భారత్ వంటి భారీ మార్కెట్ ఉన్న దేశంలోకి తిరిగి రావడానికి నిర్వాహకులు కూడా ఆసక్తిగా ఉన్నట్లు తెలుస్తోంది.

*** ఒక్కో రేసుకు రూ. 500 కోట్ల వరకు ఖర్చు!**

ఒక్కో రేసు నిర్వహణకు ఏటా దాదాపు రూ. 160 కోట్ల నుంచి రూ. 500 కోట్ల వరకు ఖర్చవుతుందని నిపుణులు చెబుతున్నారు. అయితే, పలు దేశాల్లో వాటి నిర్వాహణకు అక్కడి ప్రభుత్వాలే పూర్తి ఖర్చు భరిస్తున్నాయి. భారత్‌లో కూడా ప్రభుత్వం నుంచి గట్టి మద్దతు లభిస్తేనే ఇది సాధ్యం అవుతుందని నిపుణులు చెబుతున్నారు. కాగా, కేంద్ర ప్రభుత్వం చూపిస్తున్న చొరవ చూస్తుంటే.. త్వరలోనే భారత గడ్డపై ఫార్ములా 1 కార్లు గాలి వేగంతో దూసుకుపోవడం ఖాయంగా కనిపిస్తోంది.

## 4 నెలలుగా నిలిచిన ఒప్పందం..
## అకస్మాత్తుగా ఎలా ఖరారైందో..!: రాహుల్ గాంధీ

వాణిజ్య ఒప్పందం విషయంలో అమెరికా ఒత్తిడికి ప్రధాని మోదీ లొంగిపోయారని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ఆరోపించారు. ఈ ఒప్పందం ద్వారా రైతుల కష్టాన్ని అమ్మేశారని విమర్శించారు. "దాదాపు నాలుగు నెలలుగా నిలిచిపోయిన వాణిజ్య ఒప్పందం సోమవారం సాయంత్రం అకస్మాత్తుగా ఎందుకు ఖరారైందో మనం అర్థం చేసుకోవాలి. ఈ విషయంలో ప్రధానిపై తీవ్ర ఒత్తిడి ఉంది. అమెరికాలో వ్యాపారవేత్త అదానీపై కేసు వంటి వ్యవహారాలు దీనికి కారణం. వాణిజ్య ఒప్పందం విషయంలో ప్రధాని రాజీ పడ్డారు. రైతుల కష్టాన్ని, మొత్తం దేశాన్నే అమ్మేశారు" అని రాహుల్ విమర్శలు చేశారు. అంతకుముందు భారత సైన్యం మాజీ అధిపతి ఎం.ఎం.నరవణె రాసిన ఆత్మకథలోని అంశాలపై లోక్‌సభలో రెండో రోజూ గందరగోళం కొనసాగింది. ప్రభుత్వం తనను మాట్లాడనివ్వడం లేదని రాహుల్ ఆరోపించారు. చరిత్రలో మొదటిసారి రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై మాట్లాడేందుకు ఓ ప్రతిపక్ష నేతకు అనుమతి ఇవ్వలేదన్నారు. ఎం.ఎం.నరవణె రాసిన ఆత్మకథను ఉటంకిస్తూ తాను ప్రస్తావించిన అంశాలతో కూడిన కథనం ప్రతిని రాహుల్ ధ్రువీకరించారు. స్పీకర్ ఆదేశాలను గుర్తుచేస్తూ.. ఆ కథనం కాపీని అథెంటికేట్ చేసినట్లు చెప్పారు. ఎంపీలు ఏదైనా



డాక్యుమెంట్‌ను ధ్రువీకరించాలంటే.. తమకు తెలిసినంత వరకు అందులోని విషయాలు సరైనవేనని పేర్కొంటూ సంతకం చేసిన కాపీని సమర్పించాల్సి ఉంటుంది.

## చట్టాలను పాటించకపోతే..
## దేశం నుంచి వెళ్లిపోండి: మెటాపై సుప్రీం ఆగ్రహం

దిల్లీ: ప్రైవసీ పాలసీ విషయంలో వాట్సప్ మాతృ సంస్థ మెటా (Meta)పై సుప్రీంకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. 'మీరు మా దేశ గోప్యతతో ఆడుకోలేరు. మా డేటాలోని ఒక్క అంకెను కూడా పంచుకోవడానికి మేం అనుమతించం. ఒకవేళ దేశ చట్టాలను పాటించకపోతే భారత్‌ను వీడి వెళ్లొచ్చు' అని భారత ప్రధాన న్యాయమూర్తి (CJI) జస్టిస్ సూర్యకాంత్ హెచ్చరించారు. 2021లో వాట్సప్‌లో గోప్యతా విధానానికి సంబంధించిన ఓ పిటిషన్‌పై విచారణ జరిపిన న్యాయస్థానం ఈ వ్యాఖ్యలు చేసింది. తమ వాణిజ్య ప్రయోజనాల కోసం వాట్సప్ వినియోగదారుల డేటాను మెటాతో పంచుకుంటోందని.. ఇది సరికాదని





ప్రభుత్వం తరఫున హాజరైన సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా కోర్టుకు తెలిపారు. దీనిపై ప్రధాన న్యాయమూర్తి స్పందిస్తూ.. మెటాను హెచ్చరించారు. కొన్నిసార్లు మెటా విధానాలను అర్థం చేసుకోవడానికి తాము కూడా ఇబ్బందిపడతామన్నారు. ఒకసారి తనకు ఓ వైద్యుడు వాట్సప్‌లో మందుల ప్రిస్క్రిప్షన్ పంపితే.. దానికి సంబంధించిన ప్రకటనలే ఫోన్‌లో కనిపించాయన్నారు. ఇక దేశంలోని లక్షలాదిమంది పేద, చదువురాని ప్రజలు ఈ విధానాలను ఎలా అర్థం చేసుకుంటారని ప్రశ్నించారు.

**ఏమిటీ ప్రైవసీ పాలసీ?**

2021 జనవరిలో వాట్సప్ కొత్త ప్రైవసీ పాలసీని తీసుకొచ్చింది. దీని ప్రకారం.. యూజర్లు వాట్సప్ బిజినెస్ అకౌంట్లతో జరిపే సంభాషణకు సంబంధించిన సమాచారాన్ని ఫేస్‌బుక్‌తో పంచుకొనేందుకు అనుమతి లభిస్తుంది. కొత్త పాలసీకి అంగీకరించని వారి ఖాతాలను రద్దు చేస్తామని తొలుత హెచ్చరించింది. కానీ, దీనిపై తీవ్రస్థాయిలో ఆందోళన వ్యక్తమైంది. ఇది వ్యక్తిగత గోప్యతకు భంగం కలిగించడమేనని అభ్యంతరాలు వచ్చాయి. దీనిపై జోక్యం చేసుకొన్న కేంద్ర ప్రభుత్వం వెంటనే పాలసీ అమలును నిలిపివేయాలని ఆదేశించింది. ఐటీ చట్టంలోని నిబంధనలకు ఈ కొత్త పాలసీ పూర్తి విరుద్ధంగా ఉందని తేల్చి చెప్పింది. ఈ పాలసీపై దాఖలైన పిటిషన్‌పై తాజాగా విచారణ జరిపిన సుప్రీం ధర్మాసనం పై వ్యాఖ్యలు చేసింది.

## మయన్మార్‌లో భూకంపం..
## కోల్‌కతాలోనూ ప్రకంపనలు!

మయన్మార్‌లో భూకంపం సంభవించింది. రిక్టర్ స్కేలుపై తీవ్రత 6.1గా నమోదైంది. ఈ భూకంపం ప్రభావం తూర్పు, ఈశాన్య భారతదేశంలోని పలు ప్రాంతాలపైనా పడినట్లు సమాచారం. మంగళవారం రాత్రి కోల్‌కతా, పరిసర ప్రాంతాల్లో స్వల్ప ప్రకంపనలు సంభవించినట్లు అధికారులు తెలిపారు. మయన్మార్‌లో కొన్ని సెకన్ల పాటు భూ ప్రకంపనలు రావడంతో ఎత్తైన భవనాల్లో నివసించే కొందరు భయంతో బయటకు పరుగులు తీశారు. అయితే, ఈ భూకంపం కారణంగా వాటిల్లిన నష్టానికి సంబంధించిన వివరాలు తెలియాల్సి ఉంది.



## కుటుంబం కోసం 'సూపర్ హ్యూమన్' సాహసం..
## సముద్రంలో బాలుడి 4 గంటల పోరాటం

విహారయాత్రకు వెళ్లిన ఓ కుటుంబం సముద్రపు అలల ఉధృతికి కొట్టుకుపోగా, 13 ఏళ్ల బాలుడు ఆస్టిన్ అపెల్బీ సాహసం ప్రదర్శించి వారి ప్రాణాలను కాపాడాడు. వెస్టర్న్ ఆస్ట్రేలియాలోని క్విండాలప్‌లో జనవరి 30న ఈ ఘటన చోటుచేసుకోగా తాజాగా వెలుగులోకి వచ్చింది. ఆస్టిన్ తన తల్లి జోన్ (47), తమ్ముడు బ్యూ (12), చెల్లెలు గ్రేస్ (8)లతో కలిసి జియోగ్రాఫ్ బేలో ప్యాడిల్ కయాక్‌పై విహరిస్తున్నారు. అయితే, అకస్మాత్తుగా బలమైన గాలులు, భారీ అలలు వారిని సముద్రం లోపలికి ఈడ్చుకు పోయాయి.

*** అలసిపోని ఈత.. అద్భుత నిర్ణయం**

సముద్రంలో చిక్కుకొని పోవడంతో ఒడ్డుకు చేరుకోవడం అసాధ్యమని భావించిన బాలుడు ఆస్టిన్, సాయం కోరడానికి తనే స్వయంగా ఈదుకుంటూ వెళ్లాలని నిర్ణయించుకున్నాడు. ఈ నేపథ్యంలోనే లైఫ్ జాకెట్ ధరించి మొదటి 2 గంటల పాటు ఈదుకుంటూ అలలతో పోరాడాడు. అనంతరం లైఫ్ జాకెట్ తన వేగాన్ని తగ్గిస్తోందని గమనించిన ఆ బాలుడు ధైర్యంగా దాన్ని తీసేసి మరో 2 గంటలు ఈదాడు. దాదాపు నాలుగు గంటల తర్వాత ఒడ్డుకు చేరిన ఆస్టిన్, తీవ్ర అలసటతో ఉన్నప్పటికీ మరో 2 కిలోమీటర్లు పరిగెత్తి ఫోన్ ద్వారా అధికారులకు సమాచారం అందించాడు. ఆస్టిన్ ఇచ్చిన సమాచారంతో రంగంలోకి దిగిన రెస్క్యూ టీమ్, హెలికాప్టర్లు, బోట్ల సాయంతో సముద్రంలో గాలింపు చేపట్టింది. సుమారు 14 కిలోమీటర్ల దూరంలో ఒకే ప్యాడిల్ బోర్డును పట్టుకుని వేలాడుతున్న ఫ్యామిలీని గమనించారు. ఎట్టకేలకు రాత్రి 8:30 గంటల ప్రాంతంలో సురక్షితంగా ఒడ్డుకు చేర్చారు. అదృష్టవశాత్తూ కుటుంబ సభ్యులందరూ స్వల్ప గాయాలతో బయటపడ్డారు.

**సూపర్ హ్యూమన్ సాహసమే..**

ఈ ఘటనపై నేచురలిస్ట్ వాలంటీర్ మెరైన్ రెస్క్యూ కమాండర్ మాట్లాడుతూ.. ఆ బాలుడి పట్టుదల,




ధైర్యం మాటల్లో చెప్పలేనివని, తన ప్రాణాలను పణంగా పెట్టి కుటుంబ సభ్యుల ప్రాణాలను కాపాడాడని మెచ్చుకున్నారు. అది నిజంగా సూపర్ హ్యూమన్ సాహసమేనని పాల్ బ్రెస్లాండ్ బాలుడి ధైర్యాన్ని మెచ్చుకున్నారు. ప్రస్తుతం ఆస్ట్రేలియా వ్యాప్తంగా ఆస్టిన్ అపెల్బీని రియల్ హీరోగా వైరల్ అవుతున్నాడు.


# రత్నాల హారాలకు జుంకా పెండెంట్‌లు!

నగలంటే ఇష్టపడని అమ్మాయిలు అరుదుగా ఉంటారేమో కదా! కానీ, ఈ మధ్య పసిడి పరుగులు పెడుతూ వారిని కలవరపెడుతోంది. అలాగని శుభకార్యాలకూ, జీవితంలో ముఖ్యమైన సందర్భాలకూ కొనుక్కోకుండా ఉండలేం. పెద్ద ఎత్తున పెట్టుబడీ పెట్టలేం. ఇలాంటివారికోసమే తయారీదారులు పచ్చలు, ముత్యాలు, పగడాలు... మరెన్నో రకాల సహజాతి రత్నాలు, స్టోన్స్‌తో హారాలను రూపొందిస్తున్నారు. ఈ ప్రత్యామ్నాయం అందాన్నీ, హుందాతనాన్నీ ఇవ్వడమే కాదు, మోడర్న్ టచ్‌నీ అద్దుకోవడం వల్ల ఈ తరాన్నీ మెప్పిస్తోంది. వరుసల్లో మెరిసిపోతూ కనిపించే వీటికి జుంకాలను పోలి ఉండే పెండెంట్ కొత్తదనాన్ని తెచ్చిపెడుతున్నాయి. పోల్కీలు, వజ్రాలు, ముత్యాలు, పచ్చలు, కుందన్లు అద్దుకుని ఆకర్షణీయంగా అలరిస్తున్నాయి. పట్టు కట్టినా, ఫ్యూజన్ డ్రెస్ వేసినా... అదరగొట్టేస్తున్నాయీ బీడ్స్ హారాలు. వీటినోసారి మీరూ చూసేయండి.





# వెల్లుల్లి.. తింటున్నారా?

* ఉల్లిలాగే.. వెల్లుల్లి కూడా ఆరోగ్యానికి ఎంతో మంచిది. వెల్లుల్లిని రోజూ ఆహారంలో చేర్చుకోవడం ద్వారా బోలెడన్ని ఆరోగ్య ప్రయోజనాలు పొందచ్చంటున్నారు నిపుణులు.



**మెరుగయ్యే రక్తప్రసరణ..**

వెల్లుల్లిని ఆహారంలో భాగం చేసుకోవడం వల్ల అది శరీరం లోపల రక్తం గడ్డ కట్టకుండా కాపాడుతుంది. ఇందులోని యాంటీ క్లాటింగ్ గుణాలే దీనికి కారణం. ముఖ్యంగా గుండె జబ్బుతో బాధపడే వారు వెల్లుల్లిని రోజూ ఆహారంలో భాగం చేసుకోవడం వల్ల గుండెకు రక్తప్రసరణ మెరుగుపడుతుందని నిపుణులు చెబుతున్నారు. కానీ వివిధ రకాల శస్త్రచికిత్సలు చేయించుకోబోయే వారు మాత్రం వెల్లుల్లి వినియోగం విషయంలో ఓసారి వైద్యుడిని సంప్రదించి తగిన సలహా తీసుకోవాలని సూచిస్తున్నారు నిపుణులు.

**కొవ్వును కరిగిస్తుంది!**

అధిక బరువుతో ఇబ్బందిపడేవారు వెల్లుల్లిని ఆహారంలో భాగం చేసుకోవడం వల్ల ప్రయోజనం పొందే అవకాశాలున్నాయంటున్నారు నిపుణులు. కారణం వెల్లుల్లిలో ఉండే అలిసిన్ అనే పదార్థమే. ఇందులోని ఔషధ గుణాలు రక్తంలోని ట్రైగ్లిజరైడ్స్‌ని తగ్గించి, శరీర బరువును తగ్గించడంలో కీలక పాత్ర పోషిస్తాయని చెబుతున్నారు.

**వీటికీ మంచి మందే..!**

వెల్లుల్లి తీసుకోని వారితో పోల్చితే.. తరచూ ఆహారంలో భాగంగా దీన్ని తీసుకునే వారిలో జలుబు, ఊపిరితిత్తులకు సంబంధించిన సమస్యలు తక్కువగా వస్తాయట! వీటితో పాటు వెల్లుల్లిలోని యాంటీ బ్యాక్టీరియల్ లక్షణాల కారణంగా గొంతు సంబంధిత సమస్యలు బాధించవు. అందుకే గొంతు నొప్పితో బాధపడేవారు వెల్లుల్లిని ఆహారంలో భాగం చేసుకోవడం వల్ల సమస్య నుంచి ఉపశమనం పొందవచ్చంటున్నారు నిపుణులు.



# నూనె చిట్లి మీద పడకుండా..!

**వంట చేసే క్రమంలో చేతులు కాలడం చాలామంది మహిళలకు అనుభవమే! ముఖ్యంగా పోపు వేసేటప్పుడు నూనె చిట్లి చేతులు, ఒంటిపై పడుతుంటుంది. దీనివల్ల కూడా ఆయా భాగాల్లో బొబ్బలెక్కడం, కాలిన మరకలు ఏర్పడడం.. వంటివి జరుగుతుంటాయి. మరోవైపు కిచెన్ టైల్స్ పైనా ఈ నూనె మరకలు పడి జిడ్డుగా మారుతుంటుంది. మరి, ఇలా జరగకుండా ఉండాలంటే ఈ చిన్న చిన్న చిట్కాలు పాటిస్తే సరిపోతుందంటున్నారు నిపుణులు.**






* నూనెకు, నీటికి పడదు. ఈ క్రమంలో ఆకుకూరలు, కూరగాయలు మొదలైనవి ముందుగానే కడిగి, కట్ చేసి గిన్నెలో లేదా జాలీ లాంటి పాత్రల్లో వేసుకుంటే సులభంగా ఆరిపోతాయి.
* నూనె బాగా వేడెక్కినా.. అందులో పోపు దినుసులు, ఇతర పదార్థాలు వేశాక చిట్లుతుంటుంది. అలాగే అవి త్వరగా మాడిపోతాయి కూడా! కాబట్టి మరీ ఎక్కువగా వేడెక్కకుండా చూసుకోవాలి.
* ఫ్రిజ్‌లో నిల్వ ఉంచిన కాయగూరల ముక్కలు, ఇతర పదార్థాల్లో తేమ నిలిచి ఉంటుంది. కాబట్టి వాటిని వెనువెంటనే నూనెలో వేసినా చిట్లే ప్రమాదం ఎక్కువ. కాబట్టి ముందుగానే వాటిని ఫ్రిజ్‌లో నుంచి తీసి గది ఉష్ణోగ్రత వద్ద ఉంచాలి. వాటిలోని చల్లదనం తగ్గాక.. వాడితే సమస్య ఉండదు.
* ఒక్కోసారి తొందరలో తడిగా ఉన్న పాత్రలోనే నూనె పోస్తుంటాం. దీనివల్ల కూడా నూనె చిట్లుతుంటుంది. కాబట్టి పాత్ర కాస్త వేడెక్కాక నూనె పోయడం మంచిది.
* చాలామంది వంట త్వరగా పూర్తి కావాలన్న ఉద్దేశంతో మంట పెంచేస్తుంటారు. దీనివల్ల నూనె బాగా వేడెక్కి చిట్లడంతో పాటు కూర కూడా మాడిపోతుంది. అందుకే తక్కువ మంటపై వండితేనే అటు రుచి, ఇటు సురక్షితం..!
* అలాగే కిచెన్ ప్లాట్‌ఫామ్, స్టౌ బర్నర్స్, స్టౌ వెనక వైపున్న టైల్స్, ర్యాక్స్‌పై నూనె మరకలు పడకుండా ఉండేందుకు బేకింగ్ షీట్స్ అతికించచ్చు.
* నూనె చిట్లి మీద పడకుండా, కిచెన్ ప్లాట్‌ఫామ్ జిడ్డుగా మారకుండా.. ఇప్పుడు వివిధ రకాల గ్యాడ్జెట్స్ మార్కెట్లో అందుబాటులో ఉన్నాయి. ఇలాంటి వాటిని కూడా వినియోగించచ్చు.





# మనసు దోచే మక్రామె..!

కొత్తగా ఇల్లు కట్టుకుని ఇంటీరియర్ కోసం బడ్జెట్‌లో ప్లాన్ చేసుకోవాలా? ప్లాస్టిక్ అలంకరణలకు దూరంగా పర్యావరణహితంగా ఇంటిని అలంకరించుకోవాలి అనుకుంటున్నారా? అయితే ఈ మక్రామె వాల్ ఆర్ట్‌లు మీకు నచ్చితీరతాయి. కాటన్, ఊలు, జ్యూట్, లినెన్ దారాలతో చేతితో తయారుచేసిన ఈ అలంకరణలు ఇంటికి మినమలిస్ట్ లుక్‌ని అందిస్తాయి. అంతేకాదు, ఇంటికి పాజిటివ్ వైబ్‌ని తెచ్చి మనలో ఒత్తిడినీ తగ్గిస్తాయట. అందుకే వీటిని కాన్వాస్‌లు, వాల్ హ్యాంగింగ్స్, పాట్ హ్యాంగింగ్స్, కర్టెన్లు, టేబుల్ రన్నర్స్ రూపంలో తీసుకొచ్చారు తయారీదారులు. బెడ్‌రూమ్, లివింగ్ రూమ్, పిల్లల గది, కార్నర్ డెకార్‌గానూ అలంకరించుకోవచ్చు. అంతేకాదు, కొందరికి గోడలమీద జిగేల్‌మనిపించే రంగులు నచ్చకపోవచ్చు. అలాగని డబ్బులు పెట్టి వాల్ డెకార్లు చేయించుకోలేకపోవచ్చు. అలాంటి వాళ్లు ఈ సహజ మక్రామె వాల్ ఆర్ట్‌లు అమర్చి చూడండి.

# ధనుష్‌తో మరోసారి జతకడుతున్న సాయిపల్లవి..

## డీ55లో హీరోయిన్‌గా నేచురల్ బ్యూటీ




టాకీస్: కోలీవుడ్ స్టార్ హీరో ధనుష్, నేచురల్ బ్యూటీ సాయిపల్లవి కాంబినేషన్ అంటే ప్రేక్షకులకు మొదట గుర్తొచ్చేది 'రౌడీ బేబీ' పాట. 'మారి 2' చిత్రంలోని ఈ పాటకు ప్రేక్షకుల




ఫిదా అవ్వడంతో పాటు వీరిద్దరి కెమిస్ట్రీకి మంచి మార్కులు పడ్డాయి. అయితే ఇప్పుడు దాదాపు ఆరేళ్ల తర్వాత ఈ క్రేజీ జోడీ మరోసారి వెండితెరపై సందడి చేయబోతున్నట్లు తెలుస్తోంది. ధనుష్ కెరీర్‌లో 55వ చిత్రంగా రాబోతున్న చఆ55 లో సాయిపల్లవి హీరోయిన్‌గా ఎంపికైనట్లు తెలుస్తుంది. ఇప్పటికే ఈ చిత్రంలో శ్రీలీలను కథానాయికగా తీసుకున్న చిత్రబృందం మరో హీరోయిన్ పాత్ర కోసం సాయి పల్లవిని సంప్రదించగా.. సాయి పల్లవి ఒకే చెప్పినట్లు తెలుస్తుంది. ఈ సినిమాకు అమరన్ సినిమాతో సూపర్ హిట్ అందుకున్న రాజ్ కుమార్ పెరియాస్వామి దర్శకత్వం వహించబోతున్నాడు. 'వండర్‌బార్ ఫిల్మ్స్' సంస్థ ఈ సినిమాను నిర్మించబోతుంది.

MOVIE TIME

### థియేటర్లలో రికార్డుల వర్షం కురిపిస్తున్న

# 'మన శంకరవప్రసాద్ గారు'

**టాకీస్:** మెగాస్టార్ చిరంజీవి, అనిల్ రావిపూడి కాంబినేషన్‌లో తెరకెక్కిన తాజా ఎంటర్‌టైనర్ 'మన శంకరవప్రసాద్ గారు' సంక్రాంతి కానుకగా జనవరి 12న ప్రేక్షకుల ముందుకు వచ్చి బాక్సాఫీస్ వద్ద సంచలన విజయాన్ని అందుకుంది. విడుదలైన మొదటి షో నుంచే పాజిటివ్ టాక్ సొంతం చేసుకున్న ఈ చిత్రం మూడు వారాలు గడిచినా థియేటర్లలో జోరుగా వసూళ్లు సాధిస్తూ దూసుకెళ్తోంది. చిరంజీవి మార్క్ కామెడీ టైమింగ్, స్టెప్పులు, యాక్షన్ సీన్స్‌కు తోడు అనిల్ రావిపూడి స్టైల్ ఫ్యామిలీ ఎంటర్‌టైన్‌మెంట్ ఈ సినిమాను అన్ని వర్గాల ప్రేక్షకులకు చేరువ చేసింది. చిత్రబృందం అధికారిక ప్రకటన ప్రకారం ఈ సినిమా ఇప్పటికే ప్రపంచవ్యాప్తంగా రూ. 350 కోట్లకు పైగా వసూళ్లు సాధించి రీజినల్ సినిమాల్లో అత్యధిక కలెక్షన్లు సాధించిన చిత్రాల జాబితాలో చోటు దక్కించుకుంది.





ముఖ్యంగా ఫ్యామిలీ ఆడియన్స్ నుంచి వస్తున్న రెస్పాన్స్ ఈ మూవీ రన్‌ను మరింత బలపరుస్తోంది. పండుగ సీజన్ ముగిసినా థియేటర్లలో హౌస్‌ఫుల్ బోర్డులు కనిపించడం ఈ సినిమాకు ఉన్న క్రేజ్‌ను తెలియజేస్తోంది. థియేటర్లలో బ్లాక్‌బస్టర్‌గా నిలిచిన ఈ సినిమాను ఓటీటీలో చూడాలనే ఆసక్తి కూడా ప్రేక్షకుల్లో పెరుగుతోంది. ఈ నేపథ్యంలో 'మన శంకరవప్రసాద్ గారు' డిజిటల్ స్ట్రీమింగ్ హక్కులను ప్రముఖ ఓటీటీ ప్లాట్‌ఫామ్ జీ5 సొంతం చేసుకున్నట్లు సమాచారం. ఫిబ్రవరి 11 నుంచి స్ట్రీమింగ్ ప్రారంభమయ్యే అవకాశముందని ఇండస్ట్రీ వర్గాల్లో టాక్ వినిపిస్తోంది. ప్రస్తుతం ఇది అధికారికంగా ప్రకటించకపోయినప్పటికీ, ఫిబ్రవరి రెండో వారంలో ఓటీటీ రిలీజ్ దాదాపు ఖాయమనే వార్తలు వినిపిస్తున్నాయి. త్వరలోనే దీనిపై స్పష్టత వచ్చే అవకాశం ఉంది.

షైన్ స్క్రీన్స్, గోల్డ్ బాక్స్ ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్లపై సాహు గారపాటి, సుష్మిత కొణిదెల సంయుక్తంగా నిర్మించిన ఈ చిత్రంలో లేడీ సూపర్ స్టార్ నయనతార హీరోయిన్‌గా నటించింది. అలాగే విక్టరీ వెంకటేష్ ప్రత్యేక పాత్రలో కనిపించి ప్రేక్షకులను ఆకట్టుకున్నాడు. క్యాథరీన్ థెరీసా, సచిన్ ఖేడ్కర్, హర్షవర్ధన్, అభినవ్ గోమఠం, శరత్ సక్సేనా తదితరులు కీలక పాత్రల్లో మెరిశారు. సంగీత దర్శకుడు భీమ్స్ అందించిన పాటలు, బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ సినిమాకు మరింత బలాన్నిచ్చాయి. మొత్తంగా చూస్తే థియేటర్లలో రికార్డుల వర్షం కురిపిస్తున్న 'మన శంకరవప్రసాద్ గారు' త్వరలోనే ఓటీటీలోకి రానుండటంతో మెగా అభిమానులు మరోసారి ఈ ఎంటర్‌టైనర్‌ను ఇంటి వద్దే ఆస్వాదించేందుకు రెడీ అవుతున్నారు.

### పాప్ దిగ్గజం బయోపిక్..

# 'మైఖేల్' ట్రైలర్ విడుదల




**టాకీస్:** పాప్ దిగ్గజం మైఖేల్ జాక్సన్ జీవిత కథ ఆధారంగా తెరకెక్కుతున్న బయోపిక్ 'మైఖేల్'. ఈ సినిమా ట్రైలర్‌ను తాజాగా చిత్రబృందం విడుదల చేసింది. ఈ చిత్రంలో మైఖేల్ జాక్సన్ పాత్రను ఆయన సొంత మేనల్లుడు జాఫర్ జాక్సన్ పోషిస్తుండటం విశేషం. ట్రైలర్‌లో జాఫర్ తన నటన, డ్యాన్స్ మూమెంట్స్ మరియు బాడీ లాంగ్వేజ్‌తో అచ్చం మైఖేల్ జాక్సన్‌ను గుర్తు చేస్తూ అభిమానులను ఆశ్చర్యపరుస్తున్నాడు. ప్రముఖ దర్శకుడు ఆంటోయిన్ ఫుక్వా దర్శకత్వంలో రూపొందిన ఈ చిత్రం, మైఖేల్ జాక్సన్ చిన్నతనం నుంచి గ్లోబల్ సూపర్ స్టార్‌గా ఎదిగిన ప్రయాణాన్ని, ఆయన ఎదుర్కొన్న వ్యక్తిగత సవాళ్లను తండ్రి జో జాక్సన్‌తో ఉన్న సంక్లిష్ట సంబంధాలను కళ్ళకు కట్టినట్లు చూపించబోతోంది. ఈ చిత్రం ఏప్రిల్ 24న ప్రేక్షకుల ముందుకు రాబోతున్నట్లు సమాచారం. ఈ సినిమాలో కోల్మన్ డొమింగో, నియా లాంగ్ మైఖేల్ తల్లిదండ్రులుగా నటించగా, మైల్స్ టెల్లర్ కీలకమైన మేనేజర్ పాత్రలో కనిపించనున్నారు.

## 'ధురంధర్ 2' టీజర్ వచ్చేసింది

### మార్చి 19న 'ది రివెంజ్' షురూ!



**టాకీస్:** బాక్సాఫీస్ వద్ద రికార్డులు సృష్టించిన 'ధురంధర్' చిత్రానికి సీక్వెల్‌గా వస్తున్న 'ధురంధర్ 2' అప్‌డేట్ వచ్చేసింది. తాజాగా ఈ సినిమా టీజర్‌ను చిత్ర యూనిట్ విడుదల చేసింది. "ది రివెంజ్" అనే ట్యాగ్‌లైన్‌తో వస్తున్న ఈ పార్ట్-2పై అంచనాలు ఆకాశాన్ని తాకుతున్నాయి. దర్శకుడు ఆదిత్య ధర్ తెరకెక్కించిన సంచలన చిత్రం 'ధురంధర్' కు కొనసాగింపుగా వస్తున్న ఈ చిత్రంపై భారీ అంచనాలు ఉన్నాయి. మొదటి భాగం రూ.1300 కోట్లకు పైగా వసూళ్లతో చరిత్ర సృష్టించగా, సీక్వెల్‌లో మరింత పవర్ ఫుల్ యాక్షన్, గ్రిప్పింగ్ డ్రామా ఉండబోతున్నట్లు టీజర్ చూస్తే అర్థమవుతోంది. "ది రివెంజ్" అనే థీమ్‌తో రూపొందిన ఈ టీజర్ ప్రేక్షకులలో గూస్‌బంప్స్ తెప్పిస్తోంది. ఈ భారీ యాక్షన్ ఎంటర్టైనర్‌ను మార్చి 19న ప్రపంచవ్యాప్తంగా విడుదల చేయనున్నట్లు మేకర్స్ ప్రకటించారు. మొదటి భాగంపై వచ్చిన విమర్శలను సవాల్ చేస్తూ, ఆదిత్య ధర్ ఈ సీక్వెల్‌ను మరింత గ్రాండ్‌గా తెరకెక్కించినట్లు తెలుస్తోంది.

### అల్లు అర్జున్‌తో 'ధురంధర్' దర్శకుడు

# భారీ ప్రాజెక్ట్

### ఐకాన్ స్టార్ గ్రీన్ సిగ్నల్ ఇస్తాడా..!



టాకీస్: 'ఉరి', 'ధురంధర్' వంటి బ్లాక్ బస్టర్ చిత్రాలతో బాలీవుడ్ మేకింగ్ స్టైల్‌ను మార్చేసిన సెన్సేషనల్ డైరెక్టర్ ఆదిత్య ధర్, తన తదుపరి భారీ చిత్రాన్ని ఐకాన్ స్టార్ అల్లు అర్జున్‌తో ప్లాన్ చేయబోతున్నట్లు సమాచారం. దీనికి సంబంధించి బాలీవుడ్ మీడియా కోడై కూస్తుంది. ఆదిత్య ధర్ తన కలల ప్రాజెక్ట్ కథను ఇటీవల అల్లు అర్జున్‌కు వివరించినట్లు, దానికి బన్నీ కూడా సానుకూలంగా స్పందించినట్లు సినీ వర్గాల్లో గట్టిగా వినిపిస్తోంది. ప్రస్తుతం ఈ ప్రాజెక్ట్ చర్చల దశలో ఉందని, 2026 మార్చిలో 'ధురంధర్ 2' విడుదలైన తర్వాతే దీనిపై ఒక స్పష్టత వచ్చే అవకాశం ఉందని తెలుస్తోంది. మరోవైపు ఈ క్రేజీ కాంబినేషన్‌పై సోషల్ మీడియాలో వార్తలు వైరల్ అవుతుండటంతో చిత్ర బృందం స్పందిస్తూ ఇవన్నీ కేవలం పుకార్లేనని, అధికారికంగా ఎలాంటి ఒప్పందం కుదరలేదని ప్రాథమికంగా వెల్లడించింది. అయినప్పటికీ.. ఒక టాలెంటెడ్ డైరెక్టర్ మరియు గ్లోబల్ స్టార్ అల్లు అర్జున్ కలిస్తే బాక్సాఫీస్ రికార్డులు తిరగరాయడం ఖాయమని ఫ్యాన్స్ ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. ఒకవేళ ఈ ప్రాజెక్ట్ పట్టాలెక్కితే, ఇది భారతీయ సినిమాలోనే అతిపెద్ద యాక్షన్ డ్రామాగా నిలిచే అవకాశం ఉంది.

# 'గోల్‌మాల్ 5'లో విలన్‌గా అక్షయ్ కుమార్!

**టాకీస్:** బాలీవుడ్ స్టార్ హీరో అక్షయ్ కుమార్ గురించి ప్రస్తుతం ఒక ఆసక్తికరమైన వార్త ఫిల్మ్ నగర్ వర్గాల్లో చక్కర్లు కొడుతోంది. కామెడీ సినిమాల స్పెషలిస్ట్ రోహిత్ శెట్టి దర్శకత్వంలో రాబోతున్న బ్లాక్ బస్టర్ ఫ్రాంచైజీ 'గోల్‌మాల్ 5'లో అక్షయ్ కుమార్ పండించబోతున్నట్లు తెలుస్తుంది. అజయ్ దేవగన్, అర్షద్ వార్సీ, తుషార్ కపూర్ వంటి గోల్‌మాల్‌గ్యాంగ్‌కు అక్షయ్ తన విలనిజంతో ఎలా చుక్కలు చూపిస్తారనేది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది. అక్షయ్ కుమార్‌కి గతంలో 'అజన్బీ', 'రోబో 2.0' వంటి చిత్రాల్లో




నటించబోతున్నట్లు సమాచారం. అయితే ఇందులో అసలైన విశేషం ఏమిటంటే, అక్షయ్ ఇందులో హీరోగా కాకుండా ఒక పవర్ ఫుల్ విలన్ పాత్రలో కనిపించబోతున్నాడు. సాధారణంగా అక్షయ్ కుమార్ అంటే కామెడీ, యాక్షన్ రోల్స్‌కు కేరాఫ్ అడ్రస్, కానీ రోహిత్ శెట్టి రూపొందించే ఫుల్ లెంగ్త్ కామెడీ ఎంటర్టైనర్ 'గోల్‌మాల్'లో ఆయన విలనిజం నెగెటివ్ షేడ్స్ ఉన్న పాత్రల్లో మెప్పించిన ట్రాక్ రికార్డ్ ఉంది, కాబట్టి ఈ కామెడీ టచ్ ఉన్న విలన్ పాత్రలో ఆయన అజయ్ దేవగన్ గ్యాంగ్‌ను ఎలా ఢీకొంటారో చూడాలని అభిమానులు ఆత్రుతగా ఎదురుచూస్తున్నారు. ప్రస్తుతం ఈ ప్రాజెక్ట్ చర్చల దశలో ఉన్నట్లు తెలుస్తోంది త్వరలోనే దీనిపై చిత్ర యూనిట్ అధికారిక ప్రకటన చేసే అవకాశం ఉంది.

Printed , Published & Owned by GADDAMEDI BALARAJU, Printed, at YAGNA PRINTERS AND PUBLICATIONS # 18-105/4,Opp:SBI,Hanumanpet,Malkajgiri (M),Medchal-Malkajgiri District,Telangana State-500047 And Publishedat H. NO: 4-54-246,.Maqdum Nagar, Jagathgirigutta,IDA Jeedimetla,Balanagar Township,Medchal-Malkajgiri ,Telangana-500037 Editor : GADDAMEDI BALARAJU Cell: 9848802025 RNI.No. APTEL/2009/29786.